మనం
కరీంనగర్
జగిత్యాల- రాజన్న సిరిసిల్ల-పెద్దపల్లి-అసిఫాబాద్-మంచిర్యాల
శుక్రవారం | 16 | అక్టోబర్ | 2026 | పేజీలు 13 | www.manamepaper.com





# గ్రామాల్లో బతుకమ్మ వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

**మంత్రి పొన్నం ప్రభాకర్**

చిగురుమామిడి, అక్టోబర్ 15, మనం న్యూస్) హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని కరీంనగర్, హనుమకొండ, సిద్దిపేట జిల్లాల అధికారులతో రాష్ట్ర రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సచివాలయం నుండి మాటామంతీ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో బతుకమ్మ వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు చేయడంతో పాటు, అర్హులైన దివ్యాంగులు, వృద్ధులకు సహాయక పరికరాలు అందించేందుకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్రామాల్లో బతుకమ్మ వేడుకలకు వచ్చే మహిళలు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని అవసరమైన సౌకర్యాలు కల్పించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద బతుకమ్మ ఘాట్ల వద్ద శుభ్రత, మట్టి పనులు, ఇతర అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు

**■ జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్**



**రాయికల్, అక్టోబర్ 15 (మనం న్యూస్) :** అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు. గురువారం జగిత్యాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాయికల్ పట్టణానికి చెందిన కొండాడి కవితకు కళ్యాణలక్ష్మి పథకం కింద మంజూరైన రూ.1,00,116 విలువైన చెక్కును అందజేశారు.

**రూ.2.50 లక్షల ఎల్‌ఓసీ అందజేత**

సింగరావుపేట గ్రామానికి చెందిన తుమ్మల సంజన..


- మిగతా 2లో..





# ఓటర్ నమోదు నిరంతర ప్రక్రియ

**అర్హులైన వారు బీఎల్ఓలకు దరఖాస్తు చేసుకోవాలి**

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**



**సిరిసిల్ల అక్టోబర్ 15 (మనం ప్రతినిధి) :** ఓటర్ నమోదు నిరంతర ప్రక్రియ అని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రతి పోలింగ్ కేంద్రంలో ఈ నెల 15.10.2026 (గురువారం), 16.10.2026 (శుక్రవారం) ప్రత్యేక శిబిరాలు కొనసాగుతుండగా, తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాల నంబర్ 278, 279లో ప్రత్యేక ఓటర్ నమోదు..

# ఎల్‌నినో నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- తాగునీరు, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు
- రిజర్వాయర్ల నీటిమట్టాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి
- సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి
- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్ అక్టోబర్ 15(మనం బ్యూరో ) :** ఎల్‌నినో నేపథ్యంలో తలెత్తే పరిస్థితులను ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. తాగునీటి సరఫరాకు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. సమస్యలు తలెత్తిన తర్వాత స్పందించడం కాకుండా, సమస్యలు ఏర్పడే అవకాశమున్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి పరిష్కార మార్గాలను సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేశారు. గురువారం ఐడీఓసీలోని కలెక్టర్ ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి జిల్లా స్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఎల్‌నినో నేపథ్యంలో జిల్లాలో చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, వివిధ శాఖల సన్నద్ధతపై చర్చించారు. ఇరిగేషన్, విద్యుత్, వ్యవసాయ, భూగర్భజల శాఖలతో పాటు ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రిజర్వాయర్లలో నీటిమట్టాలను ఇరిగేషన్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. తాగునీటి అవసరాలకు సరిపడా నీరు అందుబాటులో ఉండేలా ముందస్తు..

# గ్రామాల్లో బతుకమ్మ వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

( మొదటి పేజీ తరువాయి )

గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేసి వేడుకలను విజయవంతం చేయాలని తెలిపారు. ఏర్పాట్ల విషయంలో ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

**దివ్యాంగులు, వృద్ధులకు సహాయక పరికరాల పంపిణీపై ప్రత్యేక దృష్టి**

హుస్నాబాద్ నియోజకవర్గంలో భారత కృత్రిమ అవయవాల తయారీ సంస్థ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ పథకం కింద దివ్యాంగులు, వృద్ధులకు సహాయక పరికరాల పంపిణీ కోసం ఇప్పటివరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? ప్రత్యేక శిబిరాల నిర్వహణపై సమాచారం క్షేత్రస్థాయి వరకు చేరిందా? అనే అంశాలపై మంత్రి అధికారులను ఆరా తీశారు. గ్రామాల్లో డప్పు చాటింపుల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించి, అర్హులైన దివ్యాంగులు, వృద్ధులకు అందించే సహాయక పరికరాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఒక్క అర్హుడైన లబ్ధిదారుడు కూడా మిగిలిపోకుండా గుర్తించి, ప్రతి ఒక్కరికీ సహాయక పరికరాలు అందేలా అధికారులు బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. కరీంనగర్ జిల్లాలో రెండు మండలాలకు ఒక రోజు, హనుమకొండ జిల్లాలో రెండు మండలాలకు ఒక రోజు, సిద్దిపేట జిల్లాలో మూడు మండలాలకు రెండు రోజుల పాటు ప్రత్యేక శిబిరాలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. శిబిరాల నిర్వహణకు ముందుగానే అర్హులైన లబ్ధిదారుల వివరాలను సేకరించి పూర్తి స్థాయి సమాచారం సిద్ధం చేయాలని తెలిపారు. అర్హులైన వారందరూ శిబిరాలకు హాజరయ్యేలా గ్రామ పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా, విభాగ స్థాయి అధికారులు ఈ కార్యక్రమాన్ని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అర్హులైన దివ్యాంగులు, వృద్ధులకు అవసరమైన సహాయక పరికరాలు అందించడంలో అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

# ఎల్‌నినో నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

( మొదటి పేజీ తరువాయి )

చర్యలు తీసుకోవాలని, నీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. నీటి నిల్వలు, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేశారు. నీటి లభ్యతపై నిరంతరం సమీక్షిస్తూ, సమస్యలు తలెత్తే అవకాశమున్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి పరిష్కార చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

**తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు**

రానున్న రోజుల్లో తాగునీటి అవసరాలు, నీటి లభ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. నీటి ఎద్దడి ఏర్పడే అవకాశమున్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి, అక్కడి పరిస్థితులకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని చెప్పారు. ప్రజలకు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

**విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండొద్దు**

విద్యుత్ సరఫరాకు ఆటంకాలు ఏర్పడకుండా సంబంధిత అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వ్యవసాయ అవసరాలు, నీటి సరఫరా వంటి కీలక అంశాలను దృష్టిలో ఉంచుకుని శాఖల వారీగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు.

**సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి**

ఎక్కడ సమస్య తలెత్తే అవకాశం ఉందో గుర్తించి, ఆయా ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని అధికారులకు సూచించారు. పరిస్థితులకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, దాని అమలుపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. అన్ని శాఖలు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

**పక్కా ప్రణాళికలతో రావాలి**

ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని చేపట్టాల్సిన చర్యలపై వచ్చే గురువారం మరోసారి సమీక్ష నిర్వహిస్తానని కలెక్టర్ తెలిపారు. అప్పటిలోగా ప్రతి శాఖ అధికారి సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకుని రావాలని ఆదేశించారు. సమస్యలను ముందుగానే గుర్తించి, వాటి పరిష్కారానికి స్పష్టమైన ప్రణాళికలతో ముందుకు సాగాలని సూచించారు.

# గంగాపురిలో రైతులతో మెగా ఫీల్డ్ డే కార్యక్రమం



మంథనిఅక్టోబర్13(మనం న్యూస్)ఎల్ ఎస్ ఆర్ సీడ్స్ ఆధ్వర్యంలో మంథని మండలం గంగాపురి గ్రామంలో మెగా ఫీల్డ్ డే నిర్వహించారు. గంగాపురి గ్రామానికి చెందిన రైతు కొండ సంతోష్ పత్తి పొలంలో"ఫిదా బీజీ-2","బ్రహ్మోస్ బీజీ-2"అనే పత్తి రకాలను ప్రదర్శించారు.ఈ కార్యక్రమానికి 7 గ్రామాల నుంచి సుమారు 248 మంది రైతులు హాజరై పంటను వీక్షించారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధి, ఆర్ఎస్ఎం నాంపల్లి తిరుపతిమాట్లాడుతూ ఫిదా బీజీ-2, బ్రహ్మోస్-బీజీ-2రకాలు బరువైన,పెద్ద కాయలు,ఎక్కువ కొమ్మలతో అధిక దిగుబడిని ఇస్తాయని,పురుగు, దోమ,పేనుబంక వంటి తెగుళ్లను తట్టుకునే శక్తి కలిగి ఉన్నాయని తెలిపారు.రైతు కొండ సంతోష్ తో పాటు హాజరైన రైతులు పంట దిగుబడి పట్ల సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటర్ దుర్గా దేవి ట్రేడర్స్,డీలర్స్ మహాలక్ష్మీ ఫెర్టిలైజర్స్ ప్రతినిధులు, కరీంనగర్ సేల్స్ ఆఫీసర్ యు. మహేందర్,లక్షెట్టిపేట సేల్స్ ఆఫీసర్ జి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు

( మొదటి పేజీ తరువాయి )

అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే సంజన చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్‌ఎఫ్) ద్వారా రూ.2.50 లక్షల విలువైన ఎల్‌ఓసీని ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, అర్హులైన వారికి సంక్షేమ పథకాల ద్వారా సహాయం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. చికిత్స కోసం ఆర్థిక సహాయం అందించిన ఎమ్మెల్యేకు సంజన కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ సెల్ సభ్యుడు మంద భీమ్ రెడ్డి, రాయికల్ మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, కోఆప్షన్ సభ్యులు గట్టు సతీష్, సమిండ్ల శ్రీనివాస్, కౌన్సిలర్ చీటి లక్ష్మీనారాయణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ నమోదు నిరంతర ప్రక్రియ

( మొదటి పేజీ తరువాయి )

శిబిరాన్ని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ గురువారం పరిశీలించారు. ఫారం-6 ద్వారా ఎన్ని దరఖాస్తులు వచ్చాయో ఆరా తీయగా, మొత్తం 12 దరఖాస్తులు వచ్చినట్లు బూత్ లెవల్ అధికారి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళారు. ఈ సందర్భంగా నూతన ఓటర్ నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా 16.10.2026 (శుక్రవారం) ప్రత్యేక శిబిరాలు కొనసాగుతాయని తెలిపారు. మొదటిసారి ఓటర్లుగా నమోదు చేసుకోవాలనుకునే యువత తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి, ఓటర్ల జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవడానికి 'ఫారం-6' ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పైన పేర్కొన్న రోజుల్లో సంబంధిత బీ ఎల్ ఓ లు బీ ఎల్ ఏ లు ఆయా నిర్దేశిత కేంద్రాలలో అందుబాటులో ఉంటారని తెలిపారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమని పేర్కొన్నారు. మెరుగైన సమాజ నిర్మాణానికి ఓటు హక్కు పునాది వంటిదన్నారు. 18 ఏళ్ల వయసు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకోసం ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో సిరిసిల్ల ఆర్డీవో శ్రీధర్ బాబు, ఇంచార్జి తహసీల్దార్ మురళి, సర్పంచ్ చిలువేరి లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల గుర్తింపు కోసం ఆన్‌లైన్ వెబ్‌సైట్ ఏర్పాటుపై హర్షం

**- సీఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం**

మంథని,అక్టోబర్15 (మనం న్యూస్) : తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కోసం సీఎం ప్రజావాణి ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు ఆన్‌లైన్ వెబ్‌సైట్ మాడ్యూల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడాన్ని స్వాగతిస్తూ మంథని అంబేద్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర చైర్మన్ డా. పిడమర్తి రవి ఆదేశాల మేరకు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి డా. కావటి సతీష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డా. కావటి సతీష్ మాట్లాడుతూ.. ఉద్యమకారులు 12 ఏళ్లుగా గుర్తింపు కోసంఎదురుచూస్తున్నారని,ఆన్‌లైన్ మాడ్యూల్ ఏర్పాటు ఉత్తర్వులు హర్షనీయమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబులకు కృతజ్ఞతలు తెలిపారు.జైలు జీవితం అనుభవించిన, కేసులు ఎదుర్కొన్న, గాయపడిన ఉద్యమకారులందరూ తమ ఆధారాలైన పేపర్ కటింగులు, ఫొటోలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు మిరాలరామిరెడ్డి, సాధులశ్రీనివాస్, తోకల మల్లేష్, అక్కపాక సంపత్, చిదురాల మధుకర్ రెడ్డి,ఎస్కే ముజీబ్, కోరవేన కుమార్,కాసిపేట మల్లేష్,ముష్కు ఈశ్వరమ్మ, దాసరి శంకర్,కట్టేకోల విజయ్,దాడి శ్రీనివాస్,సర్వర్ తదితరులు పాల్గొన్నారు.



## ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిపో మేనేజర్‌కు సత్కారం



మంథని అక్టోబర్15 (మనం న్యూస్)ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ మంథని డిపో ఆధ్వర్యంలో నూతనంగా వచ్చిన డిపో మేనేజర్ మంథని జ్ఞానేశ్వర్ కు చిరు సత్కారం చేశారు. ఈకార్యక్రమంలో ఎస్సీఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ మంథని డిపో అధ్యక్షులుశనిగరపు సదయ్య,సెక్రటరీ మంత్రి పోచయ్య, ఎన్.లక్ష్మయ్య, ఎన్. అంజయ్య,ఏడిసిఎం. రాములు,ఏడిసి కె.ఆనందం, సుమలత, తదితరులుపాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో దుర్గామాత సేవలో అధికారులు



జైపూర్, అక్టోబర్ 15 (మనం న్యూస్): జైపూర్ మండలం గంగిపల్లిలో దేవీ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. దుర్గామాతను గురువారం పలువురు మండల స్థాయి అధికారులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉత్సవ మండపంలో ఏసీబీ వెంకటేశ్వర్లు, తహశీల్దార్ వనజా రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ సంతోష్ కుమార్, ఎంపీడీవో శ్రీపతి బాబురావు, ఎస్సై భూమేష్‌లకు స్థానిక సర్పంచ్ సుందిళ్ల రాజేశ్వరి-మల్లేష్ దంపతులు స్వాగతం పలికారు. వారంతా పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక అర్చనలు, హారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అధికారులను సర్పంచ్ దంపతులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. గ్రామంలో ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో, వైభవంగా జరుపుకోవాలని అధికారులు అదే క్రమంగా సూచించారు. ఈ కార్యక్రమంలో నర్సింగాపూర్ సర్పంచ్ తిరుపతి, రిక్కుల వెంకటరెడ్డి, అట్ల సుమన్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శీలం వెంకటేష్, గ్రామ పెద్దలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## బతుకమ్మ వేడుకలకు ముందస్తు ఏర్పాట్లు

కాల్వ శ్రీరాంపూర్ మనం న్యూస్ అక్టోబర్ 15 : మీర్జంపేట లోతెలంగాణ రాష్ట్ర పండుగ బతుకమ్మ వేడుకలను పురస్కరించుకుని మీర్జంపేట గ్రామంలో ముందస్తు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా గ్రామంలోని ప్రధాన రోడ్లు, బతుకమ్మ ఘాట్ కు వెళ్లే దారులను బ్లేడ్ ట్రాక్టర్ సహాయంతో శుభ్రం చేయిస్తున్నారు. సర్పంచ్ పోశాల శైలజ - సదానందం గౌడ్ ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బండ మల్లారెడ్డి, ఉయ్యాల రాజసబ్, పుల్లూరి అన్విత - సాగర్, గోపు హేమలత - కొమురయ్య, ఉయ్యాల సంపత్ తదితరులు పాల్గొన్నారు.



## బ్యాంకుల భద్రత, సైబర్ నేరాల నివారణపై సీఐ సూచనలు

మేడిపల్లి అక్టోబర్ 15 (మనం న్యూస్): బ్యాంకుల భద్రతను పటిష్ఠం చేయడంతో పాటు, సైబర్ నేరాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరుట్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కొమ్ము తిరుపతి బ్యాంక్ మేనేజర్లకు సూచించారు. ఈ మేరకు గురువారం మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో మేడిపల్లి, భీమారం మండలాలకు చెందిన బ్యాంక్ మేనేజర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకుల నిర్వహణ, భద్రతా చర్యలు, సైబర్ నేరాల నియంత్రణ, ఖాతాదారులను సైబర్ మోసాల పట్ల అప్రమత్తం చేయడం వంటి అంశాలపై పలు సూచనలు చేశారు. బ్యాంకుల్లో దొంగతనాలు జరగకుండా పటిష్ఠమైన భద్రతా చర్యలు తీసుకోవాలని, బ్యాంకుల వద్ద, పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, అలారం వ్యవస్థలు నిరంతరం సక్రమంగా పనిచేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు గుర్తించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఖాతాదారులకు సైబర్ మోసాలపై అవగాహన కల్పిస్తూ, అపరిచిత వ్యక్తులకు బ్యాంకు వివరాలు, ఓటీపీలు, ఇతర రహస్య సమాచారాన్ని వెల్లడించకుండా జాగ్రత్తలు తెలియజేయాలని పేర్కొన్నారు. అనంతరం




నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ కొమ్ము తిరుపతి పోలీస్ స్టేషన్ సిబ్బందితో సమావేశమయ్యారు. సిబ్బంది విధులు, బాధ్యతలు, ప్రజలకు అందించాల్సిన సేవలు, విధి నిర్వహణలో పాటించాల్సిన క్రమశిక్షణపై సూచనలు చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, విధి నిర్వహణతో పాటు తమ ఆరోగ్యం, వ్యక్తిగత భద్రత పట్ల కూడా శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రజల భద్రత, బ్యాంకుల రక్షణ, సైబర్ నేరాల నియంత్రణకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని ఈ సందర్భంగా సీఐ కొమ్ము తిరుపతి తెలిపారు.

## వ్యవసాయంలో మహిళల పాత్ర కీలకం

రామగిరి, అక్టోబర్ 15 (మనం న్యూస్): మహిళా రైతులు వ్యవసాయ రంగంలో తమ నైపుణ్యాలను పెంపొందించుకోవడంతో పాటు స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుని ఆర్థికంగా ఎదగాలని డీపీఎం రవికుమార్, సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి సూచించారు. జాతీయ మహిళా రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) రామగిరి ఆధ్వర్యంలో గురువారం కల్వచర్ల గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ రంగంలో మహిళల ప్రాధాన్యం, స్వయం సహాయక సంఘాల ద్వారా ఉపాధి పొందే అవకాశాలను వివరించారు. గ్రామ సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి మాట్లాడుతూ మహిళలకు కుట్టు మిషన్లు, అగరబత్తుల తయారీ తదితర రంగాల్లో వారి ఆసక్తికి అనుగుణంగా అందిస్తున్న శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నైపుణ్యాలను పెంపొందించుకుని స్వయం ఉపాధి ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించాలని పిలుపునిచ్చారు. కేవీకే శాస్త్రవేత్తలు మహిళా రైతులకు వ్యవసాయంలో శ్రమను తగ్గించే సాంకేతికతలు, వివిధ శిక్షణ కార్యక్రమాలు, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. పొలాల్లో క్షేత్ర పరిశీలనలు నిర్వహిస్తూ మహిళా రైతులకు



ఆధునిక వ్యవసాయ పద్ధతులపై పరిజ్ఞానాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. కేవీకేలో మిరపతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇస్తున్నామని, ఆసక్తి ఉన్న మహిళలు ఈ అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. ఉద్యాన పాలిటెక్నిక్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. ప్రణీత్‌కుమార్ ఉద్యాన పంటల ప్రాధాన్యం, వాటి ఉప ఉత్పత్తుల తయారీ, వాటి ద్వారా లభించే ఉపాధి అవకాశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ వెంకన్న, డాక్టర్ భాస్కరరావు, డాక్టర్ వినోద్‌కుమార్, డాక్టర్ నవ్య, ఏపీఎం పద్మ, సీసీ శ్రీధర్, మహిళా రైతులు పాల్గొన్నారు.

## మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణానికి భూమి పూజ

గంగాధర, అక్టోబర్ 15, ( మనం న్యూస్ ): గంగాధర మండలం రంగారావుపల్లి గ్రామంలో స్థానిక సర్పంచ్ దాసరి శంకరయ్య గురువారం మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మినరల్ వాటర్ ప్లాంట్ ద్వారా గ్రామ ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందుబాటులోకి రానుందని, తద్వారా ప్రజలు ఫ్లోరైడ్ బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండేందుకు దోహద పడుతుందని తెలిపారు. సురక్షితమైన తాగునీరు అందు బాటులోకి



రానుండటంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ సర్పంచ్ శంకరయ్యను అభినందించారు. అనంతరం ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ, గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడంలో సహకరిస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బందికి బతుకమ్మ, దసరా పండుగ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయంలో నూతన వస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ద్యావ బహదూర్ రెడ్డి, వార్డు సభ్యులు, కార్యదర్శి మౌనిక, గ్రామప్రజలు పాల్గొన్నారు.

# ఉపవాస దీక్ష ప్రార్థనల ముగింపు సభకు పటిష్ట బందోబస్తు



బెల్లంపల్లి, అక్టోబర్ 15, (మనం న్యూస్ ) : రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మంచిర్యాల జోన్ కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని బెల్లంపల్లి కల్వరి మైదానంలో గత 50 రోజులుగా కొనసాగుతున్న ఉపవాస దీక్ష ప్రార్థనల ముగింపు సభ సందర్భంగా చేపట్టిన బందోబస్తు ఏర్పాట్లను మంచిర్యాల డీసీపీ ఏ భాస్కర్, బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్ తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ముగింపు సభకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున, వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సభా ప్రాంగణం వద్ద ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, భక్తుల రాకపోకలకు సంబంధించి తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, ప్రజలు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణలో అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ముగింపు సభ ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని డీసీపీ సూచించారు.

# పారిశుధ్య కార్మికులకు దసరా కానుకగా నూతన దుస్తుల పంపిణీ



గంగాధర, అక్టోబర్ 15, ( మనం న్యూస్ ) : దసరా పండుగను పురస్కరించుకొని గంగాధర మండలం ఉప్పరమల్యాల గ్రామపంచాయతీలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులకు అదే గ్రామానికి చెందిన జిల్లా హరికిషన్ భాగ్యలక్ష్మి దంపతులు దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉప్పరమల్యాల గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల సేవలు ఎంతో కీలకమని అన్నారు. పారిశుధ్య కార్మికులు ప్రతిరోజూ అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలు అందిస్తున్నారని, వారి కృషి వల్లనే గ్రామం పరిశుభ్రంగా ఉంటుందని అన్నారు. వారు ఎండనకా వాననకా రేయింబవళ్లు కష్టపడి గ్రామ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారని కొనియాడారు. గత మూడు సంవత్సరాలుగా

# భూపతిపూర్‌ను సందర్శించిన ట్రైనీ డిప్యూటీ కలెక్టర్




రాయికల్, అక్టోబర్ 15 (మనం న్యూస్) : రాయికల్ మండలంలోని భూపతిపూర్ గ్రామాన్ని గురువారం ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ హరిణి సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని దుర్గామాత ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించి, పంచాయతీ నిర్వహణ, రికార్డుల పరిరక్షణ, గ్రామాభివృద్ధికి సంబంధించిన అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. అలాగే మహిళా సంఘాల సభ్యులతో సమావేశమై వారి సంఘాల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ స్వయం సమృద్ధి సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు. మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుంటూ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ హరిణితో పాటు ఎంపీడీవో చిరంజీవిని గ్రామ సర్పంచ్ గుర్రం భావన మహేందర్ గౌడ్, ఉపసర్పంచ్ మూగల సంజీవ్ చారి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆదిత్య రాజ్, మహిళా సంఘాల సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దుర్గామాత పూజలో పాల్గొన్న జిఎంలు



రామగిరి, అక్టోబర్ 15 (మనం న్యూస్): సింగరేణి అడ్రియాల లాంగ్ వాల్ గని నందు దుర్గామాత శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా గురువారం చండీ హోమం, మహా ప్రసాద వితరణ, బోనాల కార్యక్రమం నిర్వహించడం జరిగింది. హా ఇట్టి కార్యక్రమానికి రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు, వెంకట లక్ష్మి దంపతులు పాల్గొని దుర్గామాత కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన మహా ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు , ప్రాతినిధ్య సంఘాల నాయకులు కొరిమి రాజ్ కుమార్, యం.రామచంద్ర రెడ్డి, కోట రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు కోల శ్రీనివాస్, ఎస్వోటుజిఎం యం.రామ్మోహన్, ఏరియా ఇంజినీర్ దూప్ సింగ్, ప్రాజెక్ట్ ఆఫీసర్ కె.జనార్ధన్, మేనేజర్ పెంచలయ్య తో పాటు ఇతర అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, పిట్ కార్యదర్శులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ నిధులతో హైమాస్ట్ లైట్లు మంజూరు



రాయికల్, అక్టోబర్ 15 (మనం న్యూస్) : నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఎంపీ నిధుల ద్వారా రాయికల్ పట్టణానికి హైమాస్ట్ లైట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు మంజూరుకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీని గురువారం బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి డా. బోగ శ్రావణి అందజేశారు. పట్టణంలో రాత్రివేళల్లో మెరుగైన వెలుతురు కల్పించడంతో పాటు ప్రజలకు భద్రత, సౌకర్యం కల్పించేందుకు హైమాస్ట్ లైట్లు ఎంతగానో ఉపయోగపడనున్నాయి. పట్టణ అభివృద్ధికి సహకరించిన ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాయికల్ పట్టణ అధ్యక్షుడు కుర్మా మల్లారెడ్డి, జగిత్యాల పట్టణ అధ్యక్షుడు కాశెట్టి తిరుపతి, స్థానిక కౌన్సిలర్ కల్లెడ ధర్మపురి, సురేష్, రాము, ఆముదరాజు, బన్న సంజీవ్, గుర్రాల తిరుపతిరెడ్డి, పవన్ సింగ్, రవితేజ, బోగ నరేష్, శ్రీనివాస్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

# చండీ హోమం కార్యక్రమంలో పాల్గొన్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీను బాబు



మంథని అక్టోబర్15 (మనం న్యూస్) జయశంకర్ భూపాలపల్లి జిల్లా మంథని నియోజక వర్గం కాటారం మండలం ధన్వాడ గ్రామంలోని శ్రీ దత్తాత్రేయ స్వామి వారి ఆలయంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని దుర్గామాత మండపంలో నిర్వహించిన చండీ హోమం కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు పాల్గొని ప్రత్యేక పూజలు,హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా దుద్దిళ్ల శ్రీనుబాబు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలపై దుర్గామాత కరుణాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని,రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. రైతులు,కార్మికులు, యువత,మహిళలు సహా అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా ఉండాలని,ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలని, ప్రజల జీవితాల్లో శాంతి,సౌభాగ్యం నిండాలని అమ్మవారిని వేడుకున్నారు. అనంతరం వేద పండితులు దుద్దిళ్ల శ్రీను బాబుకు ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం ప్రజలకు ముందస్తుగా సద్దుల బతుకమ్మ,దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు,నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో జోన్-1లో దుర్గామాత చండి హోమం



రామగిరి, అక్టోబర్ 15 (మనం న్యూస్):దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సెంటినరీకాలనీలోని జోన్-1లో శ్రీ దుర్గా గాయత్రి కమిటీ ఆధ్వర్యంలో దుర్గామాత హోమం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి, హోమంలో పాల్గొన్న భక్తులు అమ్మవారి ఆశీస్సులు పొందారు. వేదమంత్రాల నడుమ నిర్వహించిన హోమంతో ఉత్సవ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారిని భక్తితో కొలుస్తూ ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అమ్మవారి అనుగ్రహంతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు. ఉత్సవాల సందర్భంగా స్థానికంగా భక్తి వాతావరణం నెలకొంది.

# బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా మద్దెర్ల శ్రీనివాస్



బెల్లంపల్లి, అక్టోబర్ 15, (మనం న్యూస్ ) : బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శిగా బెల్లంపల్లి పట్టణానికి చెందిన మద్దెర్ల శ్రీనివాస్ నియామకం అయ్యారు. గురువారం మంచిర్యాల బీజేపీ జిల్లా కార్యాలయంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, ఓబిసి మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముఖేష్ గౌడ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు అశోక్ వర్ధన్ చేతుల మీదుగా నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మద్దెర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలో బిజెపి ఓబీసీ మోర్చా బలోపేతానికి పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పట్టి వెంకటకృష్ణ, జిల్లా కార్యదర్శి రాచర్ల సంతోష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వ విప్‌ను కలిసిన శ్రీకాంత్



ఇబ్రహీంపట్నం అక్టోబర్ 15 (మనం న్యూస్): ఇటీవల జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉప అధ్యక్షులుగా నియమితులైన బైండ్ల శ్రీకాంత్ వేములవాడ నియోజకవర్గం రుద్రంగి మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ను మర్యాదపూర్వకంగా కలిసి పార్టీ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలుపుతూ, జగిత్యాల జిల్లా స్థానిక రాజకీయ పరిస్థితి వివరిస్తూ, భవిష్యత్తులో అన్ని వర్గాల ప్రజలను కలుపుకుపోతూ, పార్టీ కార్యకర్తలను సమన్వయం చేస్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమిస్తానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఈ నియామకం పట్ల కోరుట్ల నియోజకవర్గ గ్రాజఖ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్ రావు, జిల్లా అధ్యక్షుడు నందయ్య, మరియు మెట్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లూరి సాగర్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# దసరా...బతుకమ్మ ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**బతుకమ్మ ఆడే ప్రదేశాల్లో మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదు...**

**అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి...**



హుజురాబాద్, అక్టోబర్ 15 (మనం న్యూస్): దసరా, బతుకమ్మ పండుగలను ప్రజలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకునేలా అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సూచించారు. ముఖ్యంగా బతుకమ్మ ఆడే ప్రదేశాల్లో మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ఇటీవల హుజురాబాద్ పట్టణంలో వినాయక నిమజ్జనం సందర్భంగా ఎదురైన ఇబ్బందులు బతుకమ్మ పండుగ రోజున పునరావృతం కాకుండా చూడాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి జమ్మికుంట, హుజురాబాద్ పట్టణాల మున్సిపల్ కమిషనర్లు, కౌన్సిలర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జమ్మికుంట, ఇల్లందకుంట, వీణవంక, కమలాపూర్ మండలాల్లోనూ బతుకమ్మ, దసరా ఉత్సవాల సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆర్డీవోకు ఫోన్ ద్వారా మాట్లాడి తెలియజేశారు. అన్ని మండలాల్లో అధికారులు ముందస్తు చర్యలు తీసుకొని పండుగలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని కోరారు. బతుకమ్మ వేడుకలు జరిగే ప్రాంతాల్లో మహిళలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం, పారిశుద్ధ్య నిర్వహణ, వీధి దీపాలు, తాగునీటి సౌకర్యం, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. బతుకమ్మ ఆడే ప్రదేశాల్లో మహిళలు సౌకర్యవంతంగా వేడుకల్లో పాల్గొనేలా ఏర్పాట్లు చేయాలని, నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. పండుగ సమయంలో ఎలాంటి సమస్య తలెత్తినా అధికారులు వెంటనే స్పందించేలా అందుబాటులో ఉండాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఏర్పాట్లను పర్యవేక్షించాలని ఎమ్మెల్యే సూచించారు. మహిళలకు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా హుజురాబాద్, జమ్మికుంట పట్టణాలతో పాటు వీణవంక, ఇల్లందకుంట, కమలాపూర్ మండలాల్లోనూ దసరా--బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా, ప్రశాంతంగా జరిగేలా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు.

# అభివృద్ధి పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



బెల్లంపల్లి, అక్టోబర్ 15, (మనం న్యూస్ ) : బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని, మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న అనధికార నిర్మాణాలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య అన్నారు. గురువారం జిల్లాలోని బెల్లంపల్లి పట్టణంలోని 17, 18 వార్డులను ఆకస్మికంగా సందర్శించి, ఆయా వార్డులలో జరుగుతున్న అభివృద్ధి పనులు, నిర్మాణ కార్యకలాపాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ బెల్లంపల్లి పట్టణంలోని 18వ వార్డులో సుమారు 20 లక్షల రూపాయల వ్యయంతో సిసి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందని, నిర్మాణంలో నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలు, సాంకేతిక మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, నిర్మాణ పనుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. 17వ వార్డులో అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణాన్ని పరిశీలించి, మున్సిపల్ నిబంధనలను ఉల్లంఘిస్తూ నిర్మాణాలు చేపట్టడం విరుద్ధమని, సదరు నిర్మాణానికి సంబంధించి పూర్తి వివరాలను పరిశీలించి, తక్షణ చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. అవసరమైన చట్టపరమైన ప్రక్రియను అనుసరించి అనధికార నిర్మాణాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనధికార నిర్మాణానికి ఇంటి నంబరు కేటాయించి, సంబంధిత వివరాలను ఆన్‌లైన్ వ్యవస్థలో నమోదు చేయడంలో సంబంధిత దరఖాస్తులు, అనుమతులు, ఇతర మున్సిపల్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా కేటాయింపు జరిగినట్లు నిర్ధారణ అయితే అట్టి ఇంటి నంబరు వివరాలను నిబంధనల ప్రకారం ఆన్‌లైన్ వ్యవస్థ నుంచి తొలగించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో అనధికార నిర్మాణాలకు ఇంటి నంబర్లు కేటాయించడం, వాటికి సంబంధించిన వివరాలను మున్సిపల్ రికార్డులలో నమోదు చేయడం వంటి అంశాలలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అధికారులు, సిబ్బంది తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలో పట్టణ ప్రణాళిక అమలుపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టే వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, నిబంధనల ఉల్లంఘనలను గుర్తించినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే స్పందించాలన్నారు. పట్టణంలో మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు క్రమబద్ధమైన పట్టణాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలకు నాణ్యమైన రహదారులు, మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు మున్సిపల్ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని 86, 87, 88, 89 పోలింగ్ కేంద్రాలలో కొనసాగుతున్న ప్రత్యేక శిబిరాలను సందర్శించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా దావా, అభ్యంతరాల విచారణ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. బెల్లంపల్లి ఈఆర్ఓ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశానికి హాజరయ్యారు. ఓటరు జాబితా సమగ్ర సవరణలో అర్హత కలిగిన ప్రతి ఓటరు వివరాలు జాబితాలో ఉండాలని, అనర్హుల వివరాలు ఉండకూడదని, ఆ దిశగా స్పష్టమైన ఓటరు జాబితా రూపకల్పనలో రాజకీయ పార్టీలు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్, వైస్ చైర్మన్, అసిస్టెంట్ ఇంజనీర్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జమ్మికుంటలో సద్దుల బతుకమ్మ ఏర్పాట్లను పరిశీలించిన వొడితల ప్రణవ్

జమ్మికుంట, అక్టోబర్ 15 (మనం న్యూస్): జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడ మైదానంలో సద్దుల బతుకమ్మ ఉత్సవ ఏర్పాట్లను గురువారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి వొడితల ప్రణవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ప్రభుత్వం ఈ సారి సద్దుల బతుకమ్మ కోసం రూ.25 లక్షల నిధులు కేటాయించిందని అన్నారు. లైటింగ్, దయాస్ ఏర్పాటు, మంచి నీటి సౌకర్యం, మహిళలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గత సంవత్సరం కంటే ఈ సారి అదనంగా నిధులు కేటాయించడం జరిగిందని, 17 చోట్ల సద్దుల బతుకమ్మ కోసం ఏర్పాట్లు చేయడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వ పరంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని, మహిళలు సంతోషంగా పండుగ వాతావరణంలో సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలు నిర్వహించుకోవాలని అన్నారు. జమ్మికుంట మండల, పట్టణ పరిధిలో ఈ రోజు చెక్కులు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు.

**కౌశిక్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో మండిపడిన ప్రణవ్...**

పెద్ద పెద్ద మాటలు కౌశిక్ రెడ్డి మాట్లాడుతున్నాడని, కౌశిక్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలని అన్నారు. పదేళ్లలో ఒక్క ఇళ్లు కట్టకుండా మీరు ఉంటే, 3 ఏళ్లలో 5500 ఇళ్లు



నియోజవర్గానికి ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, కడుపు నిండా సన్నబియ్యం, నూతనంగా రేషన్ కార్డులు మంజూరు చేశామని అన్నారు. జమ్మికుంట, హుజూరాబాద్ పట్టణాల అభివృద్ధి కొరకు రూ.15 కోట్ల మంజూరు చేశామని పనులు మొదలు అయ్యాయని చెప్పారు. వైద్యం కోసం డయాలసిస్ సెంటర్ లు ఏర్పాటు చేశామని, రైతులకు రుణమాఫీ చేశామని, ఎస్టీపీ లు, ట్రామా సెంటర్, ఏటీసీ సెంటర్ ను మంజూరు చేయించామని అన్నారు. హుజురాబాద్ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని అన్నారు. ప్రజల అవసరాల కోసం ఆలోచించి సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఇస్తున్నామని, మంచి పథకం అయిన కళ్యాణ లక్ష్మీ చెక్కులు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇస్తున్నామని అన్నారు.

# గంగిపల్లిలో ఇందిరమ్మ ఇండ్ల క్షేత్రస్థాయి పరిశీలన



జైపూర్, అక్టోబర్ 15 (మనం న్యూస్): జైపూర్ మండలంలోని గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ధిదారుల ఎంపికను అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా చేపడుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు. గురువారం గంగిపల్లిలో గెజిటెడ్ అధికారుల బృందం ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల తనిఖీని నిర్వహించింది. ఈ సందర్భంగా గ్రామంలోని దరఖాస్తుదారుల ఇళ్లను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అర్హులైన ప్రతి పేదవారికీ సంక్షేమ ఫలాలు అందాలనే లక్ష్యంతోనే ఈ పరిశీలన ప్రక్రియ చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ప్రణాళికాబద్ధంగా తనిఖీలు పూర్తి చేసి, తుది లబ్ధిదారుల జాబితాను రూపొందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుందిళ్ల రాజేశ్వరి మల్లేష్, ఎంపీడీఓ శ్రీపతి బాపురావు, తహశీల్దార్ వనజారెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ సంతోష్, పంచాయతీ కార్యదర్శి అరెల్లి సత్యనారాయణలతో పాటు గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఏజెంట్ కుటుంబానికి నాగార్జున డెయిరీ అండ

చిగురుమామిడి అక్టోబర్ 15 (మనం న్యూస్) : హుస్నాబాద్:నాగార్జున డెయిరీ సంస్థలో గత 16సంవత్సరాలుగా సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో పాల ఏజెంట్‌గా సేవలందిస్తున్న బళ్ళు సంపత్ ఆకస్మికంగా మృతి చెందడంతో 40వేల ఆర్థిక సహాయం అందజేశారు.ఎండ తీవ్రత కారణంగా వడదెబ్బకు గురై ఆయన మృతి చెందడం పట్ల సంస్థ ప్రతినిధులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు.సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పుల్లూరి ప్రభాకర్ రావు సూచనల మేరకు,ఈ ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో నాగార్జున డెయిరీ సీఈఓ శ్రీ కృష్ణ ప్రసాద్,ఏజీఎంలు ఆకునూరి సుధాకర్,వెంకటస్వామి, సిద్దిపేట జోన్ సేల్స్ మేనేజర్ వి.శివకుమార్,అలాగే విజయ్,ప్రకాష్,హరీష్,లక్ష్మణ్, ప్రసాద్ తదితరులు పాల్గొని నగదును అందజేశారు.ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ నాగార్జున డైరీతో 16సంవత్సరాలుగా అనుబంధం కలిగి ఉండి,పాల ఏజెంట్‌గా సేవలందించిన బళ్ళు సంపత్ మరణం సంస్థకు తీరని లోటని పేర్కొన్నారు.ఆయన కుటుంబానికి ఈ కష్ట సమయంలో అండగా నిలవడం సంస్థ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు.వ్యాపార సంబంధాలకే పరిమితం కాకుండా, సంస్థతో అనుబంధం కలిగిన ఏజెంట్ల కుటుంబాల



కష్టసుఖాల్లోనూ నాగార్జున డైరీ తోడుగా ఉంటుందని స్పష్టం చేశారు.ఏజెంట్లు,పాల ఉత్పత్తిదారులు,సిబ్బందితో సంస్థకు ఉన్న అనుబంధం కేవలం వ్యాపార సంబంధం మాత్రమే కాదని, అది కుటుంబ బంధం వంటిదని పేర్కొన్నారు.ఆపద సమయంలో తమకు అండగా నిలిచిన నాగార్జున డైరీ యాజమాన్యానికి మృతుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. నాగార్జున డైరీ వ్యాపారంలోనే కాదు మానవ బంధాలను ముందుంటుందని, ఏజెంట్లు పాల ఉత్పత్తిదారులు సిబ్బంది కుటుంబాల కష్టసుఖాలు నాగార్జున డైరీ తోడుగా ఉంటుందన్నారు.నాగార్జున డైరీ వ్యాపార సంబంధాలకే కాదు మనవ బంధాలకు కూడా ప్రాధాన్యత ఇస్తుందని వారు స్పష్టం చేశారు.

# బదిలీపై వెళ్తున్న ఆలయ ఉద్యోగికి సన్మానం

ఇల్లందకుంట, అక్టోబర్ 15 (మనం న్యూస్):అపర అయోధ్యగా పేరుగాంచిన ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిఒచిన కావటి మోహన్ యాదవ్ బదిలీపై వెళ్తున్న సందర్భంగా ఆయనకు ఆలయ అర్చకులు,



ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా దేవస్థానంలో ఆయన అందించిన సేవలను స్మరించుకుంటూ, విధుల నిర్వహణలో ఆయన చూపిన అంకితభావాన్ని కొనియాడారు. ఆయన బదిలీపై శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం మెట్టుగుట్ట కు వెళ్తున్న నేపథ్యంలో శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహాధికారి బి.సదయ్య, గ్రామ సర్పంచ్ దార సురేష్, ఉప సర్పంచ్ రంజిత్, మాజీ చైర్మన్ ఇంగ్లే రామారావు, దేవస్థాన సిబ్బంది, మాజీ ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీకి చిక్కిన తహసిల్దార్, భూభారతి కంప్యూటర్ ఆపరేటర్

వేములవాడ,అక్టోబర్15(మనం న్యూస్):రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి బాగోతం బట్టబయలైంది. ఓ బాధితుడి నుంచి లంచం డిమాండ్ చేసి తీసుకుంటుండగా తహసీల్దార్ అబూబాకర్, ఆయన ఆదేశాల మేరకు డబ్బులు తీసుకున్న భూభారతి ఆపరేటర్ సంకసాల అనిల్ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... బాధితుడు తన పని నిమిత్తం గత సెప్టెంబరు లో స్లాట్ బుక్ చేసుకుని వేములవాడ రూరల్ తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. అయితే వివిధ కారణాలు చెబుతూ దరఖాస్తును రిజెక్ట్ చేసి, పనిని పెండింగ్‌లో పెట్టారు. ఆ పని పూర్తి చేయాలంటే రూ.10



వేలు ఇవ్వాలని డిమాండ్ చేయగా, బాధితుడు తన వద్ద అంత మొత్తం లేదని, రూ.8 వేలు మాత్రమే సర్దుబాటు చేయగలనని చెప్పారు. అనంతరం బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు పక్కా వ్యూహంతో వలపన్నారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు భూభారతి ఆపరేటర్ అనిల్ రూ.8 వేలు తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు.

# అసిస్టెంట్ మెకానికల్ ఫోర్ మెన్‌కు ఘన సన్మానం

మంథని అక్టోబర్15 (మనం న్యూస్)ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ మంథని డిపో తరపున నూతనంగా విచ్చేసిన వచ్చిన మంథని డిపో అసిస్టెంట్ మెకానికల్ ఫోర్ మెన్ వెంకటేశ్వర్లుకు ఘనంగా శాలములతో సత్కరించి సన్మానించారుఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ మంథని డిపో అధ్యక్షులుశనిగరపు సదయ్య,సెక్రటరీ మంత్రి పోచయ్య,కే.లక్ష్మయ్య,విజయ్, రమేష్,తదితరులు పాల్గొన్నారు.



# యువతను వేధిస్తున్న డిస్టల్ యురేటరిక్ స్ట్రిక్చర్స్ వ్యాధి

**-యూరాలజీ వైద్య నిపుణుడు. డా యశస్వి రెడ్డి**

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 15 (మనం న్యూస్) : మంచిర్యాల పట్టణానికి చెందిన యువతకి గత కొన్ని నెలలుగా కడుపులో నొప్పి, మూత్ర ఆశయ బాధతో స్థానిక ఆస్పత్రుల లో చికిత్స పొంది నయం కాకపోవడంతో మలకపేట యశోద ఆసుపత్రి వైద్యులను సంప్రదించగా రోబోటిక్ శాస్త్ర చికిత్స అనంతరం గురువారం పాత్రికేయుల సమావేశంలో విషయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా యూరాలజీ వైద్య నిపుణులు యశస్వి రెడ్డి మాట్లాడుతూ మంచిర్యాల పట్టణానికి చెందిన 25 ఏళ్ల యువతి కి కుడి వైపు నడుము నొప్పి, మూత్రం తగ్గిపోవడం, పొత్తికడుపులో నొప్పి, మూత్ర సంబంధిత వ్యాధితో రావడం తో రోబోటిక్ రైట్ సైడ్ ఇంప్లాంటేషన్ నిర్వహించి అరుదైన శాస్త్ర చికిత్స ద్వారా మూడు రోజులలో ఇంటికి పంపించడం జరిగిందన్నారు. శాస్త్ర చికిత్స కంటే రోబోటిక్ సర్జరీ 10 రేట్లు మేలు అని అనుభవజ్ఞులైన వైద్యుల సేవలను పొందుకొని కోతలు కుట్లు లేని శాస్త్ర చికిత్సలను పొందాలన్నారు. ముఖ్యంగా పురుషులకు పోస్టేట్ ద్వార, మహిళలకు ఇన్ఫెక్షన్స్ ద్వారా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుందని మూత్రపిండాలు మహిళలకు గర్భాశయం క్రింది భాగంలో ఉండడం మూలంగా సున్నితమైన చికిత్స అవసరమన్నారు. ఈ యొక్క చికిత్సకు కన్సల్టెంట్ యూరాలజిస్ట్, అండ్రాలజిస్ట్, యూరో - ఆంకాలజిస్ట్, రోబోటిక్ రీనల్ ట్రాన్స్ఫర్మెంట్ సర్జన్ తోపాటు అనస్తీసియా వైద్య సేవలు అవసరమని తెలిపారు.




# అనాథగా మిగిలిన ఇంటర్ విద్యార్థి ఆదుకున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మల్యాల, అక్టోబర్ 15, (మనం న్యూస్) : మల్యాల మండలం కొండగట్టు గ్రామానికి చెందిన నిమ్మల ఆనందమ్మ మృతి చెందడంతో ఆమె కుమారుడు ప్రకాష్ అనాథగా మిగిలాడు. ఇదివరకే తండ్రిని కోల్పోయిన ప్రకాష్, తాజాగా తల్లిని కూడా కోల్పోవడంతో తీవ్ర దుఃఖంలో మునిగిపోయాడు. ప్రకాష్ ప్రస్తుతం మల్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. విషయం తెలుసుకున్న చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం బుధవారం ప్రకాష్ కుటుంబాన్ని పరామర్శించారు. బాలుడిని ఓదార్చి మనోధైర్యం కల్పించారు. తక్షణ 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, నాడు తండ్రి దూరమయ్యాడు, నేడు తల్లి మరణించడంతో దిక్కులేని స్థితిలో ఉన్న ప్రకాష్ కు అండగా ఉంటానని, అతని చదువు, భవిష్యత్తుకు తోడుగా నిలుస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బత్తిని శ్రీనివాస్ గౌడ్ కరీంనగర్ జిల్లా యువజన అధ్యక్షుడు ముత్యం శంకర్ గౌడ్, సర్పంచి దారం ఆదిరెడ్డి, ఉప సర్పంచ్ ముత్యం రెడ్డి వెంట ఉన్నారు



# సైదాపూర్ బీఆర్ఎస్ పార్టీ నూతన కమిటీ ఎన్నిక

సైదాపూర్ అక్టోబర్ 15 (మనం న్యూస్) : కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం ఎలాబోతారం గ్రామంలోని శ్రీ లక్ష్మీ ఫంక్షన్ హాల్ లో గురువారం నిర్వహించిన బీఅర్ఎస్ పార్టీ మండల విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశానికి మాజీ ఎమ్మెల్యే వోడితల సతీష్ కుమార్, ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడాడు. కార్యకర్తలు ఎవరు అధైర్య పడవద్దని పార్టీ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటుందని, పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, భవిష్యత్ కార్యాచరణ పై దిశా నిర్దేశం చేశారు. సైదాపూర్ బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గా చెల్మెల రాజేశ్వర్ రెడ్డి, బిఆర్ ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గా పైడిపల్లి రవీందర్ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ నూతన మండల కార్య వర్గాన్ని ప్రకటించారు. ఎన్నికైన మండల అధ్యక్షులకు, ప్రధాన కార్యదర్శికి పార్టీ నాయకులు కార్యకర్తలు అభినందనలు తెలియజేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. నూతన కమిటీ అధ్యర్యంలో పార్టీని మండలంలోని ప్రతి గ్రామంలో మరింత బలోపేతం చేస్తూ పార్టీ కార్యకర్తలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్ రెడ్డి, మాజీ పిఏసిఎస్ స్ చైర్మన్ బిల్లా వెంకట్ రెడ్డి, మాజీ బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు సోమారపు రాజయ్య, సీనియర్ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


చెల్మెల రాజేశ్వర్ రెడ్డి
మండల అధ్యక్షులు


పైడిపల్లి రవీందర్ గౌడ్
మండల ప్రధాన కార్యదర్శి

# భూముల రి సర్వే పనులపై గ్రామసభ



మంథని అక్టోబర్15 (మనం న్యూస్) మంథని మండలం గుంజపడుగు గ్రామంలో కాసిపేట శివారులో గల భూముల రీ సర్వే పై గురువారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ దండేవేన సంధ్య బానేష్ మాట్లాడుతూ కాజీపేట శివారులోని రైతులందరూ తమ పట్టా పాస్ పుస్తకాలు రైతుల భూములకు సంబంధించి సరిహద్దులు, విస్తీర్ణం రెవెన్యూ రికార్డులో సక్రమంగా ఉండాలంటే రైతులందరూ సహకరించాలని ఆమె కోరారు. ఈ రీ సర్వే ద్వారా భూముల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులతో పరిశీలించడానికి అవకాశం ఉంటుందని ఆమె తెలిపారు. కాసిపేట శివారులో భూములు ఉన్న రైతులందరూ తప్పనిసరిగా సర్వేలో పాల్గొనాలన్నారు. రైతులందరూ భూమికి సంబంధించిన పట్టాదార్ పాస్ బుక్, అందుబాటులో ఉన్న భూమి రికార్డులు సర్వే నంబర్లు వంటి వివరాలను అందుబాటులో ఉంచుకోవాలని, సర్వే సమయంలో భూమి సరిహద్దుల విషయంలో ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకు రావాలన్నారు. భూమి సరిహద్దుల విషయంలో గొడవలు లేకుండా పరస్పర సహకారంతో సమస్యలను పరిష్కరించుకోవాలని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ కిరణ్, డిఐ రమేష్, సర్వేయర్ రాజశేఖర్ చారి, ఉప సర్పంచ్ ఎల్కలక్ష్మి, సదానందం, వార్డు సభ్యులు దొడ్డిపట్ల శంకర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# దసరా సంబరం.. క్రికెట్ సమరం



జైపూర్, అక్టోబర్ 15 (మనం న్యూస్):జైపూర్ మండలం వెంకట్రావుపల్లి పంచాయతీలో దసరా వేడుకలను పురస్కరించుకుని గురువారం వెంకట్రావుపల్లి, దుబ్బపల్లి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ క్రీడాకారుల ఉత్సాహం నడుమ ఘనంగా ముగిసింది. స్థానిక సర్పంచ్ జాడి లక్ష్మి, ఉప సర్పంచ్ మాల్కర్ రాజకుమార్ ల సమక్షంలో నిర్వహించిన ఈ పోటీల్లో దుబ్బపల్లి జట్టు విజేతగా నిలవగా, వెంకట్రావుపల్లి జట్టు ద్వితీయ స్థానాన్ని దక్కించుకుంది. అనంతరం సర్పంచ్ చేతుల మీదుగా విజేత దుబ్బపల్లి జట్టుకు రూ. 5,000 నగదు బహుమతి, ఉప సర్పంచ్ చేతుల మీదుగా ద్వితీయ విజేత వెంకట్రావుపల్లి జట్టుకు రూ. 2,500 నగదు బహుమతిని అందజేశారు. క్రీడలు యువతలో మానసిక ఉల్లాసాన్ని నింపుతాయని, ప్రతిఒక్కరూ క్రీడా స్ఫూర్తిని చాటాలని ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, యూత్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# కల్తీ ఆహారం, అపరిశుభ్రతపై వాట్సాప్ ద్వారానే ఫిర్యాదు

జైపూర్, అక్టోబర్ 15 (మనం న్యూస్):మన చుట్టూ ఉన్న పరిసరాలలో, తిండి తినే చోట్ల నాణ్యత లోపించడం, అపరిశుభ్ర వాతావరణం ఉండటం వంటి సమస్యలు ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలకు ఆహార నాణ్యత, హోటళ్లు, తాగునీటి ప్లాంట్లు తదితర అంశాలకు సంబంధించి ఏవైనా సమస్యలు లేదా ఫిర్యాదులు ఉంటే, వాటిని వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఒక సులభమైన మార్గాన్ని అందుబాటులోకి తెచ్చారు. ప్రజలు తమకు ఎదురయ్యే ఫుడ్ సేఫ్టీ, పరిశుభ్రతకు సంబంధించిన ఏవైనా సమస్యలపై ఫుడ్ సేఫ్టీ అధికారికి నేరుగా వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేసేందుకు 7981904028 నంబరును అందుబాటులోకి ఉంచడం జరిగింది. హోటళ్లలో నాణ్యత లేని ఆహారాన్ని విక్రయించడం, తాగునీటి ప్లాంట్ల నిర్వహణ సరిగ్గా లేకపోవడం లేదా ఇతర ఎలాంటి ఆహార సంబంధిత ఇబ్బందులు ఎదురైనా, బాధితులు ఈ నంబర్‌ను ఉపయోగించి క్షణాల్లో తమ ఫిర్యాదును అధికారులకు చేరవేయవచ్చు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే దిశగా అధికారులు తీసుకున్న ఈ నిర్ణయం ఎంతగానో దోహదపడుతుందని ఆశిద్దాం.

# చెరువులో పడి కానిస్టేబుల్ సమ్మన్న మృతి

చెన్నూరు అక్టోబర్ 15(మనం న్యూస్ )మండలంలోని,దుగ్నేపల్లి గ్రామానికి చెందిన వీరబోయిన. సమ్మయ్య తండ్రి ఐలయ్య( 43)అతడు నీల్వాయి పోలీస్ స్టేషన్ లో,పోలీస్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్నాడు.సమ్మయ్య కు ప్రతిరోజు ఉదయం వాకింగ్ వెళ్లి బహిర్భూమికి వెళ్లడం అలవాటు. రోజులాగే గురువారం ఉదయం 5గంటలకు ఇంటి నుండి యధావిధిగా సమ్మయ్య వాకింగ్ చేస్తూ బహిర్భూమికి ఇంటినుండి వెళ్లినాడు. 7 గంటలైనా సమ్మయ్య ఇంటికి రాక పోయే సరికి అతని భార్య అలాగే కుటుంబ సభ్యులు ఊర్లో వెతుకుతుండగా. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో దుగ్నేపల్లి గ్రామ శివారు గల నక్కకుంట చెరువులో మృతుడు చనిపోయి ఉన్నాడు. మృతుడు బహిర్భూమికి చెరువు వద్దకు వెళ్లి ప్రమాదవుశాత్తూ చెరువులో పడి ఈత రాక నీటిలో మునిగి చనిపోయాడు. మృతుని భార్య వీరబోయిన. దీప్తి (30 )ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ ఐ శ్యామ్ పటేల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

# కుందారం సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ అంతరాయం

జైపూర్, అక్టోబర్ 15 (మనం న్యూస్):జైపూర్ మండలం కుందారం సబ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో నేడు విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడనుందని స్థానిక డివిజన్ ఏఈ గోమాస మనోహర్ గురువారం ప్రకటించారు. సబ్ స్టేషన్‌లో సాంకేతిక మెరుగుదల, నూతన కెపాసిటర్ బ్యాంక్ ఏర్పాటు పనులను అత్యవసరంగా చేపట్టాలని నిర్ణయించినట్లు ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పనుల నిమిత్తం ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 02:00 గంటల వరకు సుమారు నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరాను పూర్తిగా నిలిపివేయనున్నట్లు తెలిపారు. అందువల్ల శెట్టిపల్లి, నర్సింగాపూర్, బెజ్జాల, మద్దులపల్లి, కుందారం గ్రామాల్లో విద్యుత్ సేవలు నిలిచిపోనున్నాయి. అత్యవసర పనుల నిమిత్తం చేపడుతున్న ఈ విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు, ప్రజలు ఎటువంటి అసౌకర్యానికి గురికాకుండా తగిన ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు. ప్రజలు, వినియోగదారులు అందరూ విద్యుత్ శాఖ సిబ్బందికి పూర్తి సహకారం అందించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

# ప్రజల సంక్షేమమే మా ప్రాధాన్యత

## -34వ వార్డులో ఆత్మీయంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

బెల్లంపల్లి, అక్టోబర్ 15, (మనం న్యూస్ ): పేద ప్రజల ఆకలి తీర్చే సంక్షేమ పథకాలను వారి గుమ్మం ముంగిటికే చేర్చాలనే సంకల్పంతో ఈరోజు 34వ వార్డు హనుమాన్ బస్తీలో మనసును హత్తుకునే కార్యక్రమం జరిగింది. స్థానిక కౌన్సిలర్ కొక్కుల రామ్మూర్తి ఆధ్వర్యంలో గురువారం లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బెల్లంపల్లి మున్సిపల్ చైర్మన్ దావ స్వాతి రమేష్ బాబు రేషన్ కార్డులను అందించారు. ఈ కార్యక్రమంలో 27వ వార్డు కౌన్సిలర్ బేతి శ్రావణ్ కుమార్, 26వ వార్డు కౌన్సిలర్ ఇప్ప కుమారస్వామి, నాయకులు బండి ప్రభాకర్ యాదవ్, కంకటి శ్రీనివాస్, పీక లక్ష్మణ్, రేషన్ డీలర్ అంబాల ఓదెలు, బస్తీ ఆడపడుచులు, పెద్దలు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసు అధికారులను విధుల నుంచి తొలగించాలి

కరీంనగర్ రూరల్ అక్టోబర్ 15 (మనం న్యూస్ )..రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట పోలీస్ స్టేషన్ ఎస్ఐ చుక్కల శ్రీకాంత్, సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్ర చారి జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం వలన తీవ్ర నొప్పులతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జర్నలిస్టులను కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (ఖవూూ), జిల్లా కార్యదర్శి తిప్పారపు సురేష్,తెలంగాణ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కూతాడీ శివరాజ్, జిల్లా కార్యదర్శి అంగడి కుమార్ జర్నలిస్ట్ బాధితులను పరామర్శించారు. జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీని తీవ్రంగా ఖండించారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులపై పోలీసులే దాడులకు పాల్పడటం, చిత్రహింసలకు గురిచేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏక్ దమ్ న్యూస్ ఎడిటర్ కొత్తూరు శేఖర్, చీఫ్ బ్యూరో సంపత్ రాతిపల్లిపై పోలీసులు థర్డ్ డిగ్రీ వలన తీవ్ర నొప్పులతో, కరీంనగర్ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న జర్నలిస్టుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, వారికి సంఘీభావం ప్రకటించింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజల సమస్యలు, ప్రభుత్వ వ్యవస్థల్లోని లోపాలు, అధికారుల బాధ్యతారాహిత్యాన్ని ప్రజల ముందుకు తీసుకువచ్చే జర్నలిస్టులపై పోలీసు అధికారులే దౌర్జన్యానికి పాల్పడటం అత్యంత గర్హనీయమని అన్నారు. చట్టాన్ని అమలు చేయాల్సిన పోలీసులే చట్టవిరుద్ధంగా వ్యవహరించారనే ఆరోపణలు రావడం ఆందోళనకరమని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లిన వ్యక్తుల పట్ల చట్టబద్ధంగా వ్యవహరించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని, ఎలాంటి పరిస్థితుల్లోనూ చిత్రహింసలకు పాల్పడటం సమర్థనీయం కాదని పోలీసుల తీరు హేయమైన చర్య అని అన్నారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛ, గౌరవప్రదమైన జీవితం కల్పించిందని, పోలీసుల కస్టడీలో ఉన్న వ్యక్తుల హక్కులను పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత అని నాయకులు గుర్తుచేశారు. జర్నలిస్టులపై దాడులు, బెదిరింపులు, అక్రమ నిర్బంధాలు చోటుచేసుకుంటే ప్రజాస్వామ్యానికి, పత్రికా స్వేచ్ఛకు తీవ్ర విఘాతం కలుగుతుందని అన్నారు. మీడియా స్వేచ్ఛను కాపాడాల్సిన ప్రభుత్వమే ఇటువంటి ఆరోపణలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రజల్లో పోలీసు వ్యవస్థపై నమ్మకం దెబ్బతింటుందని హెచ్చరించారు. ఈ ఘటనపై నిష్పాక్షిక విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.




జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారనే బాధితుల ఆరోపణపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని నాయకులు డిమాండ్ చేశారు. సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్ర చారి, గంభీరావుపేట ఎస్ఐ చుక్కల శ్రీకాంత్ పాత్రపై స్వతంత్రంగా, నిష్పాక్షికంగా విచారణ జరిపించాలని కోరారు. విచారణలో ఆరోపణలు రుజువైతే సంబంధిత అధికారులను విధుల నుంచి తొలగించడంతో పాటు చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత జర్నలిస్టులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని, వారికి మరియు వారి కుటుంబ సభ్యులకు తగిన భద్రత కల్పించాలని కోరారు. ఘటనకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు, స్టేషన్ రికార్డులు, వైద్య నివేదికలు తదితర ఆధారాలను భద్రపరిచి, ఎలాంటి జాప్యం లేకుండా విచారణ పూర్తి చేయాలని సూచించారు. బాధితుల వాంగ్మూలాలను స్వేచ్ఛగా నమోదు చేసి, సాక్షులపై ఒత్తిడి లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతుకలను అణచివేయడం ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరించలేరని, జర్నలిస్టులపై దాడులు జరిగితే వాటిని ఖండించాల్సిన బాధ్యత ప్రతి ప్రజాస్వామికవాదిపై ఉ ందని నాయకులు పేర్కొన్నారు. పత్రికా స్వేచ్ఛను పరిరక్షించడం, పోలీసు వ్యవస్థలో జవాబుదారీతనాన్ని పెంపొందించడం, ప్రజల హక్కులకు భరోసా కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు.

**జర్నలిస్టులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తాం**

జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ ఆరోపణలు వస్తున్న ఈ అమానవీయ ఘటనపై ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని కె వి పి ఎస్,తెలంగాణ జనతా పార్టీ, పి డి ఎస్ యు నాయకులు డిమాండ్ చేశారు. పోలీసు అధికారుల అధికార దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయాలని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ కోసం, ప్రజాస్వామ్య విలువల సాధన కోసం తమ సంఘాలు బాధితులకు అండగా నిలుస్తాయని తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

హుజురాబాద్, అక్టోబర్ 15 (మనం న్యూస్): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు పుట్టినిల్లు అని, బతుకమ్మ పండుగ అంటే ప్రతి ఆడబిడ్డ సంతోషంగా గడిపి, పూలను ప్రకృతిగా భావించి పూజించే గొప్ప పండుగ బతుకమ్మ అని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. హుజురాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ముందస్తుగా సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ కార్యాలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తుందని ఇంటికి దీపం మహిళలే కాబట్టి వారి అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తుందని, రానున్న రోజుల్లో వారి సంక్షేమానికి మరిన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెడతామని అన్నారు. నియోజవర్గ వ్యాప్తంగా వచ్చిన కాంగ్రెస్ పార్టీ మహిళా శ్రేణులతో కార్యాలయం కిటకిటలాడింది. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అన్ని మండలాల, పట్టణ అధ్యక్షులు,:మహిళా అధ్యక్షురాల్లు, జిల్లా మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు, ప్రజా ప్రతినిధులు, అన్ని అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



# చిగురుమామిడి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం




చిగురుమామిడి:లిఅక్టోబర్ 15) మనం న్యూస్) : కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం (ఐపీఎస్) చిగురుమామిడి పోలీస్ స్టేషన్ ను గురువారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ముందుగా పోలీస్ స్టేషన్ లోని జనరల్ డైరీ, ఎఫ్ఐఆర్ నమోదు పుస్తకాలు, పెండింగ్ కేసుల వివరాలు, రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీట్ల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. కేసుల దర్యాప్తు ఎంతవరకు వచ్చింది, చార్జ్ షీట్ లు సకాలంలో దాఖలు చేస్తున్నారా లేదా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్ ఆవరణం, రిసెప్షన్ కౌంటర్, మహిళా సహాయ కేంద్రం, లాకప్ గదులను పరిశీలించారు. స్టేషన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, రికార్డులన్నీ పద్ధతి ప్రకారం నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ..“పోలీస్ స్టేషన్ కు వచ్చే ప్రతి బాధితుడు మనపై నమ్మకంతో వస్తాడు. వారితో మర్యాదపూర్వకంగా, మానవత్వంతో వ్యవహరించాలి. వారి ఫిర్యాదును ఓపికగా విని, చట్ట ప్రకారం త్వరితగతిన న్యాయం అందించాలి. బాధితులకు భరోసా కల్పించడమే మన మొదటి బాధ్యత” అని అన్నారు. “శాంతిభద్రతల విషయంలో ఎక్కడా రాజీ పడవద్దు. గ్రామాల్లో నిరంతరం నిఘా ఉంచాలి. రాత్రి వేళల్లో గస్తీ ముమ్మరం చేయాలి.

పాత నేరస్తుల కదలికలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ప్రజలతో స్నేహపూర్వక పోలీసింగ్ చేస్తూనే, నేరాల నియంత్రణలో కఠినంగా వ్యవహరించాలి” అని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయవద్దని, సామాజిక మాధ్యమాల్లో వచ్చే ఫిర్యాదులపై కూడా వెంటనే స్పందించాలని ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో రూరల్ ఏసీపీ విజయకుమార్, తిమ్మాపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ అనిల్, చిగురుమామిడి ఎస్ఐ జగదీశ్వర్ మరియు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# లక్ష్మీపురం పంచాయతీలో బతుకమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ.. దాతలకు అభినందనల వెల్లువ



కాల్వ శ్రీరాంపూర్ మనం న్యూస్ అక్టోబర్ 15 : కాల్వ శ్రీరాంపూర్ మండలం లక్ష్మీపురం గ్రామపంచాయతీ పరిధిలోని రాయపేటలో బతుకమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. కీర్తిశేషులు గోపగోని పరుశరాములు గౌడ్ జ్ఞాపకార్థం ఆయన సోదరుడు, మాజీ ఎంపీపీ, జడ్పీటీసీ గోపగోని సారయ్య గౌడ్ బతుకమ్మ విగ్రహాన్ని విరాళంగా అందించి తన సోదరుడి జ్ఞాపకాలను చిరస్థాయిగా నిలిపారు. అదేవిధంగా కీర్తిశేషులు మ్యాకల మల్లారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు మ్యాకల రాజిరెడ్డి–మంగ, తిరుపతిరెడ్డి–రమాదేవి, లక్ష్మీపురం సర్పంచ్ మ్యాకల లావణ్య–జనార్దన్ రెడ్డి దంపతులు మరియు బండ అనూష–రాజు గద్దెను నిర్మించారు. బతుకమ్మ పండుగ సాంస్కృతిక ప్రాధాన్యతను కాపాడేందుకు దాతలు ముందుకు రావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఈ బతుకమ్మ విగ్రహాన్ని ఈ నెల 18న పెద్దపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు చేతుల మీదుగా ఆవిష్కరించనున్నట్లు సర్పంచ్ మ్యాకల లావణ్య జనార్దన్ రెడ్డి తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జంగిలి తిరుపతి, వార్డు సభ్యులు పంచిక రజిత–మల్లేష్, బోయిని చందర్, పూల ఐలయ్య, ఉమ్మారెడ్డి చంద్రకళ–సమ్మిరెడ్డి, నల్ల కొండిల్ల లింగయ్య, కొండిల్ల అశోక్, సుజాత–స్వామి, గ్రామస్తులు తిరుపతిరెడ్డి, వంగళ వెంకటరెడ్డి, ఉమ్మారెడ్డి రాజు, బోయిని సతీష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# విద్యానగర్‌లో చండీ హోమం



హుజురాబాద్, అక్టోబర్ 15 (మనం న్యూస్): హుజురాబాద్ పట్టణంలోని విద్యానగర్‌లో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ దేవి శరణ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం చండీ హోమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ వి.నవీన్ చంద్ ఐపీఎస్ హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా హుజురాబాద్ పట్టణ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో ఉండాలని, పండుగలను ప్రశాంత వాతావరణంలో ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వైష్ణవి మురళి మంచికట్ల, దామెర అనుషా – అనురాగ్, గురుస్వామి నటరాజ్ బుర్ర, ఎల్.వి. అర్జున్‌తో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# రహదారి గుంతలను పూడ్చిన నిమ్మనపల్లి సర్పంచ్



పెద్దపల్లి: అక్టోబర్ 15 మనం న్యూస్ : ప్రయాణికులు, వాహనదారుల సౌకర్యార్థం రహదారిపై ఏర్పడిన ప్రమాదకర గుంతలను నిమ్మనపల్లి సర్పంచ్,ఉ బీజేపీ మండల అధ్యక్షులు వేల్పుల రమేష్ ఆధ్వర్యంలో పూడ్చివేత కార్యక్రమం చేపట్టారు. పెద్దపల్లి నుండి జూలపల్లి వెళ్లే ప్రధాన రహదారిపై పెద్ద ఎత్తున గుంతలు పడటంతో నిత్యం ప్రయాణించే వాహనదారులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గ్రహించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సొంత నిధులతో మెటీరియల్ తెప్పించి, స్వయంగా పర్యవేక్షించి రోడ్డుపై ఉన్న గుంతలను సిమెంట్ మరియు కంకరతో పూడ్చివేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వేల్పుల రమేష్ మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా గ్రామాల్లో మరియు పరిసర ప్రాంతాల్లో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని అన్నారు. అధికారులు, ప్రభుత్వం వెంటనే స్పందించి మిగిలిన రహదారులకు కూడా శాశ్వత మరమ్మతులు చేపట్టాలని కోరారు.

# భారతరత్న అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలు మరువలేనివి

కరీంనగర్ అక్టోబర్ 15(మనం బ్యూరో ).. భారతదేశ మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను బీజేపీ మైనారిటీ మోర్చా మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్ ఆధ్వర్యంలో కరీంనగర్లోని పార్లమెంట్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం ముఖ్య అతిథిగా విచ్చేసి, అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాయిని మల్లేశం , మైనార్టీ మోర్చా మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ ముజీబ్ లు మాట్లాడుతూ.. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం కేవలం ఒక శాస్త్రవేత్త మాత్రమే కాదని, కోట్ల మంది యువతకు రోల్ మోడల్, నిరుపమాన దేశభక్తుడని కొనియాడారు. దేశ ప్రగతికి యువత శక్తి ఎంతో కీలకమని నమ్మిన కలాం , విద్యార్థుల్లో ఉన్నతమైన ఆలోచనలు నింపడానికి తన జీవితాంతం కృషి చేశారని గుర్తుచేశారు. ఆయన చూపిన బాటలో నడుస్తూ, దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, సమీయుల్లా అహ్మద్, సైద్, ఫయాజ్, అబూ బకర్, అమెర్, రౌఫ్,తదితరులు అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు.



# దుర్గా యూత్ యకిన్‌పూర్ ఆధ్వర్యంలో ఘనంగా మహా అన్నప్రసాద వితరణ




కోరుట్ల అక్టోబర్ 15 (మనం న్యూస్) : కోరుట్ల మున్సిపల్ పరిధి 6వ వార్డు యకిన్ పూర్ గ్రామంలో నేడు శ్రీ దుర్గా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించగా ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గొనగా అన్నప్రసాద వితరణ కార్యక్రమం విజయవంతమైనట్లు శ్రీ దుర్గా యూత్ వ్యవస్థాపక అధ్యక్షులు జాగిలం కర్ణాకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 6వ వార్డు కౌన్సిలర్ మేడిపల్లి శిరీష శేఖర్ రెడ్డి తో పాటు మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామ అభివృద్ధి కమిటీ నేతృత్వంలో కౌన్సిలర్ మేడిపల్లి శిరీష శేఖర్ రెడ్డి సంయుక్త నిర్వహణలో శ్రీ దుర్గా యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గామాత ప్రాంగణంలో ప్రతినిత్యం కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు దుర్గా యూత్ కమిటీ సభ్యులు, గ్రామ అభివృద్ధి కమిటీ సంఘాల సభ్యులు పేర్కొన్నారు. గత అనేక ఏళ్లుగా గ్రామ ప్రజల, కుల సంఘాల సహకారంతో గ్రామంలో దుర్గామాత కార్యక్రమాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తున్నట్లు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు దుర్గామాత కమిటీ సభ్యులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతినిత్యం అర్చకుల వైదిక నిర్వహణలో మహిళల సమిష్టి కృషితో భవాని దీక్ష స్వాముల సహకారంతో అంగరంగ వైభవంగా దుర్గా నవరాత్రోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా దుర్గా యూత్ కమిటీ సభ్యులు అన్న ప్రసాద కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రజలందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజే శారు. ఇట్టి కార్యక్రమానికి సహకరిస్తున్న గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులకు వస్తు రూపేనా, ధన రూపేనా సహకరించిన వారందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు యువత ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# మైతాపూర్ లో ఘనంగా దుర్గా దేవి బోనాలు



రాయికల్, అక్టోబర్ 15 (మనం న్యూస్) : రాయికల్ మండలం మైతాపూర్ గ్రామంలోని గిరిగుట్టపై వెలసిన కనకదుర్గ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం ఐదో రోజు అమ్మవారు శ్రీ లలితా త్రిపురసుందరి దేవి అలంకారంలో భక్తులకు దర్శన మిచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు ఇంటింటా బోనాలు వండి, తలపై ఎత్తుకొని ఒగ్గు కళాకారుల నృత్యాలు, డీజే చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని అమ్మవారికి సమర్పించారు. గ్రామంలోని పలు కూడళ్లలో కళాకారుల నృత్యాలు ఆకట్టుకు న్నాయి. భక్తులకు గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ లు మద్దూరి జనార్దన్, మద్దూరి స్వామిరెడ్డి అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు జగదీశ్వర్ శాస్త్రి, అర్చకులు విశాల్ ఈశ్వర్, రంజిత్ పూజలు నిర్వహించి ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు, వివిధ గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యాసంగిలో వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా వరి సాగుకు దూరంగా ఉండాలి

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**




పెద్దపల్లి, అక్టోబర్ 15:యాసంగి సీజన్‌లో వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు వరి సాగు చేయకుండా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, యాసంగి సీజన్‌లో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు వరి సాగుకు దూరంగా ఉండాలని సూచించారు. నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకొని సాగు నిర్ణయాలు తీసుకోవాలని, అవసరమైతే పొలాలను బీడుగా ఉంచుకోవాలని తెలిపారు. వరి సాగుకు బదులుగా మొక్కజొన్న, పప్పుధాన్యాలు, కూరగాయలు వంటి తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలను సాగు చేసేలా రైతులకు సూచించాలని అధికారులను ఆదేశించారు. తక్కువ కాలంలో దిగుబడి వచ్చే ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితుల్లో పంట నష్టాలను నివారించేందుకు, నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు రైతులకు అవసరమైన సూచనలు అందించాలని తెలిపారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో ఉంటూ ప్రత్యామ్నాయ పంటల సాగుపై మార్గదర్శనం చేయాలని ఆదేశించారు. వానాకాలం సీజన్‌లో ధాన్యం సేకరణకు సంబంధించి ముందస్తు అంచనాలు సిద్ధం చేయాలని సూచించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు (పీపీసీ) ఎంత పరిమాణంలో ధాన్యం వచ్చే అవకాశం ఉంది, ప్రైవేటు మార్కెట్‌కు ఎంత పరిమాణంలో వెళ్లే అవకాశం ఉందనే అంశాలపై స్పష్టమైన అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. ఈ వివరాల ఆధారంగా ధాన్యం సేకరణకు అవసరమైన ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా రైతులకు సరైన పంటల ఎంపికపై సూచనలు అందించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా సహకార అధికారి శ్రీమాల, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రసాద్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవాలి



సిరిసిల్ల అక్టోబర్ 15 (మనం ప్రతినిధి) : దుర్గా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సిరిసిల్ల పట్టణంలో గురువారం సాయంత్రం జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే పలు దుర్గాదేవి మండపాలను సందర్శించి, అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి,జిల్లా ప్రజలకు దుర్గా నవరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ....నవరాత్రి ఉత్సవాలను ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో, ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకున్నారు. దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా జిల్లా వ్యాప్తంగా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టడం జరిగిందని,ఉత్సవాల నిర్వహణ నుంచి నిమజ్జన శోభాయాత్ర ముగిసే వరకు నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసులకు సహకరిస్తు ముందస్తు ప్రణాళికతో నిర్దేశించిన సమయానికి నిమజ్జనం పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గణేష్ నిమజ్జనం రోజున ఎట్టి పరిస్థితుల్లోనూ డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. పోలీసుల సలహాలు, సూచనలు పాటిస్తూ ఎలాంటి గొడవలు, అవాంఛనీయ సంఘటనలు, ప్రమాదాలు చోటుచేసుకోకుండా శోభాయాత్ర ప్రశాంతంగా సాగేలా పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. ఉత్సవాల సందర్భంగా ఏదైనా సమస్యలు తలెత్తినా, అవాంఛనీయ సంఘటనలు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

# మనసున్న మహారాజు.. అనాథ పిల్లలకు ఆప్యాయతల ఆలయం

## చిన్నారులకు అండగా సుంకె రవిశంకర్ దంపతులు...

## కన్నీళ్లు తుడిచి.. కడుపునిండా భోజనం పెట్టి.. సొంత బిడ్డల్లా ఆదరణ...



కరీంనగర్ అక్టోబర్ 15(మనం బ్యూరో )..అధికారం ఉంటేనే ప్రజలకు సేవ చేయాలనుకునే ఈ రోజుల్లో.. అధికారం ఉన్నా లేకున్నా తనను నమ్ముకున్న వారిని, ఆపదలో ఉన్న అభాగ్యులను అక్కున చేర్చుకోవడమే తన బాధ్యతగా భావిస్తున్నారు చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్. పదవులు మారినా.. రాజకీయ పరిస్థితులు మారినా.. తన మనసులోని మానవత్వం మాత్రం మారదని మరోసారి నిరూపిస్తున్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన చిన్నారులకు ఆయన అందిస్తున్న ఆప్యాయత, భరోసా, సహాయం చూస్తే.. రక్తసంబంధం లేకున్నా మనసుతో ఏర్పడే బంధం ఎంత గొప్పదో అర్థమవుతుంది. ప్రతి సంవత్సరం బతుకమ్మ పండుగ సందర్భంగా అనాథ పిల్లలను తన ఇంటికి ఆహ్వానించి, కొత్త బట్టలు పెట్టి, వారితో కలిసి భోజనం చేయడం సుంకె రవిశంకర్ దంపతులకు ఒక ఆచారంగా మారింది. ఈ ఏడాది కూడా గంగాధర మండలం బూరుగుపల్లిలోని తన నివాసంలో భార్య దీవెనతో కలిసి పిల్లలకు కొత్త బట్టలు అందించి, స్వయంగా భోజనం వడ్డించి, వారితో కలిసి భోజనం చేశారు. పండుగ అంటే కేవలం కొత్త బట్టలు, పిండి వంటలు మాత్రమే కాదు.. ఆప్యాయతను పంచుకోవడం, మనవాళ్లు ఉన్నారనే నమ్మకాన్ని కల్పించడం కూడా అని తమ ఆచరణతో చాటిచెప్పారు.

**కన్నీళ్లు తుడిచి.. తండ్రిలా భరోసా ఇచ్చి.**

తల్లిదండ్రులు లేని పిల్లలకు పండుగ రోజుల్లో ఇతరుల ఇళ్లలో కనిపించే సందడి తమ జీవితాల్లో లేదనే బాధ ఉండొచ్చు. అలాంటి చిన్నారులు తనను చూడగానే భావోద్వేగానికి గురికావడం చూసిన రవిశంకర్ వారిని దగ్గరకు తీసుకుని కంటతడి తుడిచారు. "మీకు నేనే తండ్రిని.. ఇది మీ ఇల్లు. నా ఊపిరి ఉన్నంతకాలం మిమ్మల్ని నా సొంత పిల్లల్లాగే ప్రేమిస్తా.. ఆదరిస్తా" అంటూ భరోసా ఇచ్చారు. జీవితంలో ఏ అవసరం వచ్చినా, ఎప్పుడైనా తన దగ్గరకు రావచ్చని, ఏ సమస్య ఉన్నా ఒక తండ్రిలా భావించి చెప్పుకోవాలని ధైర్యం చెప్పారు.

ఆ మాటలు పిల్లలకు కేవలం ఓదార్పు మాత్రమే కాదు.. తమకు కూడా ఒక కుటుంబం ఉందనే నమ్మకాన్ని కలిగించే ఆత్మీయ పలుకులు. ఒకవైపు కన్నీళ్లు తుడుస్తూ.. మరోవైపు వారి భవిష్యత్తుపై భరోసా కల్పిస్తూ సుంకె రవిశంకర్ దంపతులు చూపిస్తున్న ప్రేమ ఆ పిల్లల జీవితాల్లో చెరగని జ్ఞాపకంగా నిలిచిపోతుంది.

**ఆర్థిక సాయమే కాదు.. భవిష్యత్తుకూ అండ**

సుంకె రవిశంకర్ సేవలు పండుగ రోజున బట్టలు పెట్టడం, భోజనం పెట్టడంతోనే ఆగిపోలేదు. తల్లిదండ్రులను కోల్పోయి నిలువ నీడ లేక ఇబ్బందులు పడుతున్న చిన్నారుల పరిస్థితిని తెలుసుకుని తనవంతుగా ఆర్థిక సహాయం అందించడంతో పాటు, ఎన్నారైలు, స్థానిక ప్రజాప్రతినిధులు, దాతల సహకారంతో మరింత సాయం అందేలా కృషి చేశారు. పిల్లల చదువు, నివాసం, ఉపాధి, భవిష్యత్తు వంటి అంశాలపై శ్రద్ధ చూపుతూ వారికి జీవితంపై ఆశ కల్పించారు. కాట్నపల్లికి చెందిన నేరెళ్ల సమత, మమతలు నివసించడానికి ఇల్లు లేక టెంట్ కింద ఉంటున్న పరిస్థితిని చూసి చలించిపోయి, తనవంతుగా రూ.20 వేల సహాయం అందించడంతో పాటు ఎన్నారైల సహకారంతో రూ.15 లక్షలు సమీకరించి వారికి అందించారు. వారికి ఇల్లు, చదువు, ఉపాధి విషయంలోనూ సహకారం అందించారు. అలాగే పలువురు అనాథ పిల్లలకు తనవంతుగా ఆర్థిక సాయం అందిస్తూ, అవసరమైన చోట దాతల సహకారాన్ని కూడగడుతూ అండగా నిలిచారు. ఈ సహాయాల వెనుక ఉన్నది కేవలం డబ్బు కాదు.. తమకు ఎవరూ లేరనే భావనలో ఉన్న చిన్నారులకు ఎవరో ఒకరు తమ గురించి ఆలోచిస్తున్నారనే భరోసా. పిల్లల కష్టాన్ని తన కష్టంగా భావించి స్పందించడం, వారి భవిష్యత్తు కోసం బాధ్యత తీసుకోవడం ఆయన సేవల్లోని ప్రత్యేకత.

**పదవి కంటే మానవత్వమే గొప్పది**

రాజకీయాల్లో పదవులు శాశ్వతం కాదు. అధికారం ఎప్పుడూ ఒకేలా ఉండదు. కానీ మనిషి చేసే మంచి పనులు, కష్టాల్లో ఉన్నవారికి అందించే చేయూత మాత్రం వారి జీవితాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయి. సుంకె రవిశంకర్ చేస్తున్న సేవలు కూడా అదే విషయాన్ని గుర్తుచేస్తున్నాయి. తన సొంత బిడ్డలతో సమానంగా అనాథ పిల్లలను అక్కున చేర్చుకుని, వారి అవసరాలను తనవిగా భావిస్తూ, పండుగ పూట వారి ముఖాల్లో చిరునవ్వులు చూడాలనుకోవడం ఆయనలోని మానవత్వానికి నిదర్శనం. బతుకమ్మ పండుగ సందర్భంగా పిల్లలకు కొత్త బట్టలు పెట్టి, స్వయంగా వడ్డించి, వారితో కలిసి భోజనం చేసిన సుంకె రవిశంకర్ దంపతులు మరోసారి ఆప్యాయతకు అర్థం చెప్పారు. తల్లిదండ్రుల ప్రేమకు దూరమైన చిన్నారులకు తండ్రిలా అండగా నిలుస్తూ, వారి జీవితాల్లో ఆశాకిరణంగా మారుతున్నారు. అందుకే ఆయనకు పదవితో వచ్చిన గుర్తింపు మాత్రమే కాదు.. ఆపదలో ఉన్న పిల్లల కన్నీళ్లు తుడిచి, వారికి ఆత్మీయతను పంచుతున్న వ్యక్తిగా ప్రత్యేక గుర్తింపు ఉంది. అధికారం ఉన్నా లేకున్నా సేవే మార్గంగా.. మానవత్వమే తన బలంగా ముందుకు సాగుతున్న సుంకె రవిశంకర్ నిజంగా ఓ మనసున్న మహారాజు.

---

# దళిత జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ ప్రయో గించిన గంభీరావుపేట్ ఎస్ ఐ శ్రీకాంత్ తో పాటు బాధ్యులైన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలి

**-తెలంగాణ రక్షణ సేన పార్టీ రాష్ట్ర అ ధ్యక్షురాలు**

**కల్వకుంట్ల కవిత**



మెట్ పల్లి అక్టోబర్ 15 ( మనం న్యూ స్ ) దళిత జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ ప్రయో గించిన గంభీరావు పేట్ ఎస్ ఐ శ్రీకాంత్ తో పాటు, సంఘటనకు బాధ్యులైన పో లీసులపై ఎస్సీ ఎస్టి అట్రాసిటీ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవా లని తెలంగాణ రక్షణ సేన పార్టీ రాష్ట్ర అ ధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. దళిత జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ ప్రయోగిం చడం ప్రజాస్వామ్యంపై దాడి అని ఆమె పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీ రావు పేట్ లో దళిత జర్నలిస్టులు పో త్తూరి శేఖర్, సంపత్ లపై థర్డ్ డిగ్రీప్రయో గించిన గంభీరావు పేట్ ఎస్సై పై కఠిన చ ర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చే శారు. ఈ ఘటనపై గురువారం "ఎక్స్" లో పోస్ట్ చేశారు. జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ కి పాల్పడిన ఎస్సై సహా మిగతా పోలీసు లపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కే సులు నమోదు చేయాలన్నారు. ఎస్సై భూ అక్రమాలు,పంచాయితీలు, సెటిల్ మెంట్లపై వార్తలు రాస్తే అక్రమ కేసులు పె ట్టి థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తారా అని ప్రశ్నించా రు. గంభీరావుపేట పోలీస్ స్టేషన్ లోనే జర్నలిస్టుల నోట్లో గుడ్డలు కుక్కి, అత్యం త పాశవికంగా థర్డ్ డిగ్రీ ప్రయోగించి వా రిని తీవ్రంగా హింసించారన్నారు. ఇది అ త్యంత అమానుష చర్య అంటూ ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులకు మే జిస్ట్రేట్ రిమాండ్ తిరస్కరించారంటే ఏ స్థాయిలో వారి పై పోలీసులు దాడి చేశా రో అర్థం చేసుకోవచ్చన్నారు. ప్రజాస్వా మ్యంలో నాలుగో స్తంభమైన మీడియా పై ఈ తరహా దాడులు ఆక్షేపణీయమ న్నారు. జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ ప్రయో గించడం అత్యం తదుర్మార్గమైన చర్య అన్నారు. ఈ ఘటనకు బాధ్యుడైన గంభీ రావు పేట ఎస్సై పై నామమాత్రపు చర్య లతో సరిపెట్టాలని చూస్తే అది పోలీసు వ్యవస్థకు మచ్చ తెస్తుందన్నారు. ఈ వి షయంపై డీజీపీ వెంటనే స్పందించి ఎస్సై తో పాటు బాధ్యులశీదరిపై ఎస్సీ ఎస్టీ అ ట్రాసిటీ కేసులు నమోదు చేసి కఠిన చర్య లు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశా రు.

---

# పెద్దపల్లి పట్టణంలోని అయ్యప్ప టెంపుల్ సమీపంలో బతుకమ్మ వేడుకలు పాల్గొన్న ముఖ్య అతిథి అరుణ మండలి చైర్మన్ విమలక్క

పెద్దపల్లి అక్టోబర్ 15 మనం న్యూస్: రాష్ట్రంష్ట్రంలో పాలకుల వైఫల్యం తో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అరుణోదయ మండలి చైర్మన్ విమలక్క అన్నారు రాష్ట్రంలో బలు బలహీన వర్గాలు అందరూ ఏకతాటికే వచ్చి మరో పోరాటానికి సిద్ధం కావాలని ఆమె పిలుపునిచ్చారు రానున్న రోజుల్లో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటారని బతుకమ్మ అందరికీ ఏకాదడివే తీసుకొచ్చే ఇలాంటి పండుగలు ముఖ్యమైన పండుగ బతుకమ్మ అని మహిళలు చిన్నారులు యువత మంచి మార్గంలో పయనించి కొనసాగాలని అన్నారు రాష్ట్రంలో మహిళలపై అనేక అత్యాచారాలు అగత్యాలు జరుగుతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు యువత మత్తులో బానిసై గంజాయి కి అలవాటు పడి పురాణాలు కోల్పోతున్నారని అన్నారు దీనికి కారణం పాలకులే అధికారులు అన్నారు ఈ కార్యక్రమంలో బీసీ నాయకురాలు టిఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష బిసి జిల్లా అధ్యక్షులు నల్లవెల్లి శంకర్ 22 వార్డ్ కౌన్సిలర్ ఉప్పు రాజు స్వరూపతోపాటు అరుణదల మండలి సభ్యులు పాల్గొన్నారు.



# ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువు



హుజురాబాద్, అక్టోబర్ 15 (మనం న్యూస్):తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం కరువు గడియలు సమీపిస్తున్నాయని ఇది కాలం తెచ్చిన కరువు కాదని, ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువని బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బండ శ్రీనివాస్ ఆరోపించారు. హుజురాబాద్ పట్టణంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులకు కారణం రేవంత్ రెడ్డి సర్కార్ వైఫల్యమే కారణమన్నారు. వందలాది క్యూసెక్కుల నీరు వృధాగా పోయి సముద్రం పాలు అవుతున్న ఆ నీటిని మళ్లించడంలో ప్రభుత్వానికి సరైన ప్రణాళిక లేక పోవడం వల్ల రాష్ట్రంలో కరువు విలయతాండవం చేసే పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుండి నీటిని తరలించే అవకాశం ఉన్నప్పటికీ మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ కు ఎక్కడ మంచి పేరు వస్తుందో అని భయపడి రైతాంగానికి తీరని అన్యాయం చేసిన ఈ ప్రభుత్వానికి భవిష్యత్ లో రైతులే గుణపాఠం చెప్పే రోజులు వస్తాయని అన్నారు. ప్రభుత్వానికి ముందు చూపు లేకపోవడంతో సాగు, తాగునీటి సమస్యలు ఏర్పడుతున్నాయని అన్నారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. దేశంలో ఎక్కడ లేని విధంగా రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించిన ఘనత కేసీఆర్ కే దక్కుతుందని అన్నారు. రాష్ట్రంలో సరిపోను బొగ్గు నిక్షేపాలు ఉన్నప్పటికీ వినియోగించుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు.

వేసవికి ముందే విద్యుత్ కోతల కారణంగా వ్యవసాయ పంపుసెట్లు కాలిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని విమర్శించారు. విద్యుత్ సరఫరా లో అంతరాయం వల్ల గృహ వినియోగ దారులు, వ్యాపారస్తులు తిరిగి ఇన్వర్టర్ ల వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు.

ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యుత్ సమస్యతో పాటు, సాగు, తాగునీరు సరఫరాకు తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సందర్భంగా అమలు కాని హామీలు గుప్పించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఢిల్లీ పర్యటనలను ప్రక్కన పెట్టి తెలంగాణ ప్రజలు, రైతులు, కార్మికుల సంక్షేమం కోసం దృష్టి సారించాలని, లేనట్లయితే ఆ ప్రజలే వచ్చే ఎన్నికలలో కర్రు కాల్చి వాత పెడుతారని బండ శ్రీనివాస్ హెచ్చరించారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు గందె శ్రీనివాస్, ఇరుమళ్ల సురేందర్ రెడ్డి, కొలిపాక శ్రీనివాస్, కటుకూరి మల్లా రెడ్డి, వర్ధినేని రవీందర్ రావు, తాళ్లపల్లి శ్రీనివాస్ ,గఫార్, ధనవర్ష రాజు, ఆర్కె రమేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్

పెద్దపల్లి, అక్టోబర్ 15: మనం న్యూస్ : యాసంగి సీజన్లో వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు వరి సాగు చేయకుండా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్లో వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, యాసంగి సీజన్లో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు వరి సాగుకు దూరంగా ఉండాలని సూచించారు. నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకొని సాగు నిర్ణయాలు తీసుకోవాలని, అవసరమైతే పొలాలను బీడుగా ఉంచుకోవాలని తెలిపారు. వరి సాగుకు బదులుగా మొక్కజొన్న, పప్పుధాన్యాలు, కూరగాయలు వంటి తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలను సాగు చేసేలా రైతులకు సూచించాలని అధికారులను ఆదేశించారు.తక్కువ కాలంలో దిగుబడి వచ్చే ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితుల్లో పంట నష్టాలను నివారించేందుకు, నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు రైతులకు అవసరమైన సూచనలు అందించాలని తెలిపారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో ఉంటూ ప్రత్యామ్నాయ పంటల సాగుపై మార్గదర్శనం చేయాలని ఆదేశించారు.వానాకాలం సీజన్లో ధాన్యం సేకరణకు సంబంధించి ముందస్తు అంచనాలు సిద్ధం చేయాలని సూచించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు (పీపీసీ) ఎంత పరిమాణంలో ధాన్యం వచ్చే అవకాశం ఉంది, ప్రైవేటు మార్కెట్కు ఎంత పరిమాణంలో వెళ్లే అవకాశం ఉందనే అంశాలపై స్పష్టమైన అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. ఈ వివరాల ఆధారంగా ధాన్యం సేకరణకు అవసరమైన ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా రైతులకు సరైన పంటల ఎంపికపై సూచనలు అందించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా సహకార అధికారి శ్రీమాల, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రసాద్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతకు విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు

పెద్దపల్లి, అక్టోబర్ 15: మనం న్యూస్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కార్మిక, ఉపాధి, శిక్షణ మరియు కర్మాగారాల శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న ‘తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టాంకామ్)’ ద్వారా పెద్దపల్లి జిల్లాకు చెందిన అర్హులైన నిరుద్యోగ యువతకు విదేశాల్లో ఉద్యోగావకాశాలు అందుబాటులో ఉన్నాయని జిల్లా ఉపాధి అధికారి ఎం. రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒమన్, బహ్రెయిన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (అబుదాబి), కువైట్, ఖతార్ దేశాల్లో వివిధ రంగాలకు సంబంధించిన ఉద్యోగాలకు అర్హతలు, అనుభవం కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వివిధ దేశాల్లో అందుబాటులో ఉన్న విదేశీ ఉద్యోగావకాశాల వివరాలు: ఒమన్ దేశంలో అగ్రికల్చర్ వర్కర్ విద్యా అర్హత: పదవ తరగతి,ఇంటర్మీడియట్ , డిప్లొమా , బహ్రెయిన్ లో లాస్ రికవరీ సూపర్వైజర్ విద్యాఅర్హత: ఏదైనా డిగ్రీ ,

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ – అబుదాబిలో

పైప్‌లైన్ రిపేర్ , ఇంటెగ్రిటీ ఎక్విప్‌మెంట్ , విద్యా అర్హత బిఇ మెకానికల్ అనుభవాన్ని డ్రిల్లింగ్ ,డౌన్‌హోల్, కంప్లీషన్ టూల్స్, విద్యా అర్హత బిఇ మెకానికల్ ,కువైట్ లో సూపర్ వైజర్, కెమిస్ట్ విద్యా అర్హత బీఎస్సీ డిప్లొమా ,ఖతార్ లో నర్స్ టెక్నీషియన్, నర్సింగ్ లైసెన్స్‌డ్ ప్రాక్టీషనర్ నర్స్ ,విద్యా అర్హత సంబంధిత నర్సింగ్ అవసరమైన ప్రొఫెషనల్ లైసెన్స్ మరిన్ని వివరాల టామ్ కామ్ హెల్ప్‌లైన్ నంబర్లలో 08035524946, 040-23342040 సంప్రదించవచ్చని, జిల్లాలోని అర్హులైన నిరుద్యోగ యువత తమ విద్యార్హతలు, అనుభవానికి తగిన ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకొని ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# నల్లగొండలో పీఆర్టీయూ టిఎస్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు



రాయికల్, అక్టోబర్ 15(మనం న్యూస్) : పీఆర్టీయూ టిఎస్ 6వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు గురువారం నల్లగొండలో ఘనంగా ప్రారంభమయ్యాయి. 72 వేల మంది సభ్యులున్న సంఘ సమావేశంలో పీఆర్సీ అమలు, సర్వీస్ రూల్స్ సమస్యల పరిష్కారం, సీపీఎస్ రద్దు, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్, పెండింగ్ బిల్లులు తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశాలకు జగిత్యాల జిల్లా నుంచి కన్నవేణి మల్లారెడ్డి, సంధి శ్రీనివాస్ రెడ్డి, బొమ్మకంటి శ్రీనివాస్,పొన్నం రమేష్, గజెంగి రాజేశం, అంతడుపుల గంగరాజం, రాపర్తి నర్సయ్య, లక్కడి రాజారెడ్డి వజీద్, జలీల్, శేఖర్, జమున, శ్రీదేవి, నాగరాణి తదితరులు హాజరయ్యారు.

# ఏపీ జే కలాం జయంతి వేడుకలు

పెద్దపల్లి అక్టోబర్ 15 మనం న్యూస్: పెద్దపల్లి జిల్లా ప్రింట్ మీడియా అసోసియేషన్, ఆధ్వర్యంలో ఈ రోజు 15-10-2026 గురువారం రోజున మన యూనియన్ తరుపున ఐతీ “ౠా.జీౠాఎబశ్రీ ఖుశ్రీఖుఎ గారి జన్మదిన వేడుకలు బస్టాండ్ దగ్గర ఉన్న అమర వీరుల స్తూపం వద్ద ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమం లో యూనియన్ అధ్యక్షుడు దిడ్డి రాజయ్య, ప్రధాన కార్యదర్శి ఎం డి ముస్తఫా ఉపాధ్యక్షులు సబీర్ భాష కోశాధికారి మార్కరాజు వైస్ ప్రెసిడెంట్ అంజయ్య కలవల రాజేశం బిల్లా రమేష్ చింతపూల రమేష్ రాకేష్ భరత్ తదితరులు అబ్దుల్ కలాం గారికి పూలమాలలు వేసి స్వీట్లు పంపిణీ చేశారు.



# 12 గంటల్లోనే పవన్ సింగ్ హత్య కేసు ఛేదించిన పోలీసులు

### టైల్స్ వర్క్ కాంట్రాక్టర్ పవన్ సింగ్ హత్య కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్.

### డబ్బుల కోసమే హత్య చేసినట్లు పోలీసుల వెల్లడి..

### రైల్వే స్టేషన్‌లో పట్టుకుని రిమాండ్‌కు తరలింపు.



సిరిసిల్ల అక్టోబర్ 15 (మనం ప్రతినిధి) : రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామంలో సంచలనం సృష్టించిన టైల్స్ వర్క్ కాంట్రాక్టర్ పవన్ సింగ్ హత్య కేసును పోలీసులు కేవలం 12 గంటల్లోనే ఛేదించారు. డబ్బుల కోసం తమతో కలిసి పనిచేస్తున్న టైల్స్ పనుల కూలీలే కాంట్రాక్టర్‌ను హత్య చేసి పరారైనట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసులో ప్రధాన నిందితులుగా పేర్కొంటున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన జోగిందర్, శివమ్‌లను ప్రత్యేక పోలీసు బృందం రైల్వే స్టేషన్‌లో అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసింది. అనంతరం వారిని న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

**ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ మీడియా సమావేశం.**

గురువారం ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో డీఎస్పీ కత్తురోజు నాగేంద్రచారి హత్యకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. గొల్లపల్లి గ్రామంలో జరిగిన ఈ హత్యపై కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితులను గుర్తించి పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించినట్లు వివరించారు. సీఐ ఓ. వెంకటేష్ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేసి, నిందితులు పరారైన మార్గాలు, అందుబాటులో ఉన్న ఆధారాలపై దృష్టి సారించారు.

**టైల్స్ కాంట్రాక్టర్ పవన్ సింగ్ హత్య.**

ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పవన్ సింగ్ టైల్స్ వర్క్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. వివిధ ప్రాంతాల్లో నూతనంగా నిర్మిస్తున్న భవనాలకు టైల్స్ బిగించే పనులు చేపడుతూ, తన రాష్ట్రానికి చెందిన ఇతర కూలీలను కూడా పనుల నిమిత్తం తీసుకువచ్చేవాడని తెలిసింది. ఈ క్రమంలో గొల్లపల్లి గ్రామంలో పనులు నిర్వహిస్తున్న సమయంలో పవన్ సింగ్ హత్యకు గురయ్యాడు. గొల్లపల్లిలోని శాతవాహన కాలనీ సమీపంలో నూతనంగా నిర్మించిన భవనానికి సంబంధించిన గదిలో ఈ ఘటన వెలుగుచూసింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పంచనామా నిర్వహించి, హత్య జరిగిన గది, పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. క్లూస్ టీమ్ సహాయంతో కీలక ఆధారాలను సేకరించి దర్యాప్తు చేపట్టారు.

**డబ్బుల కోసమే హత్య చేసినట్లు వెల్లడి.**

పోలీసుల దర్యాప్తు ప్రకారం.. పవన్ సింగ్‌తో కలిసి పనిచేస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన కూలీలు జోగిందర్, శివమ్ డబ్బుల కోసం ఈ హత్యకు పాల్పడినట్లు వెల్లడైంది. హత్య అనంతరం అక్కడి నుంచి పరారైన ఇద్దరు నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. కేసును సవాలుగా తీసుకున్న సీఐ వెంకటేష్ ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం సాంకేతిక, ఇతర ఆధారాల సహాయంతో దర్యాప్తును ముమ్మరం చేసింది. ఈ క్రమంలో పరారీలో ఉన్న జోగిందర్, శివమ్‌లను రైల్వే స్టేషన్‌లో గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని అరెస్ట్ చేసి, చట్టపరమైన ప్రక్రియ పూర్తిచేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ నాగేంద్రచారి మీడియాకు వివరించారు.

**పోలీసు బృందానికి డీఎస్పీ అభినందనలు.**

హత్య జరిగిన కొద్ది గంటల్లోనే దర్యాప్తును వేగవంతం చేసి, 12 గంటల్లో నిందితులను గుర్తించి అరెస్ట్ చేయడంలో కీలకంగా వ్యవహరించిన పోలీసు సిబ్బందిని డీఎస్పీ నాగేంద్రచారి అభినందించారు. ఈ కేసులో విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ చేతుల మీదుగా రివార్డు అందించేందుకు సిఫారసు చేస్తానని తెలిపారు.

గొల్లపల్లిలో టైల్స్ వర్క్ కాంట్రాక్టర్ పవన్ సింగ్ హత్య స్థానికంగా కలకలం రేపగా, పోలీసులు వేగంగా స్పందించి నిందితులను పట్టుకోవడంతో కేసు దర్యాప్తులో కీలక ముందడుగు పడింది. ఈ సమావేశంలో ఎల్లారెడ్డి పేట సి ఐ ఓ.వెంకటేష్,ఎల్లారెడ్డి పేట ఎస్ ఐ ఎన్.రమేష్ గౌడ్,వీర్నపల్లి ఎస్ ఐ లక్ష్మణ్ తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారంపై కసరత్తు

### బైపాస్ రోడ్డులోని డంపింగ్ యార్డ్‌ను పరిశీలించిన కలెక్టర్ చిత్రా మిశ్రా....

### ప్రత్యామ్నాయ స్థలాల గుర్తింపుపై దృష్టి.. పొగ, కాలుష్య నివారణకు చర్యలు...



కరీంనగర్ అక్టోబర్ 15(మనం బ్యూరో)..కరీంనగర్ బైపాస్ రోడ్డులోని డంపింగ్ యార్డ్ సమస్యకు పరిష్కారం చూపే దిశగా జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, రెవెన్యూ డివిజనల్ అధికారి షర్మిలతో కలిసి గురువారం డంపింగ్ యార్డ్‌ను సందర్శించి అక్కడి పరిస్థితులను సమీక్షించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కాలుష్య నివారణ చర్యలు చేపట్టడంతోపాటు, డంపింగ్ యార్డ్‌కు ప్రత్యామ్నాయ స్థలాన్ని గుర్తించే అంశంపై అధికారులతో చర్చించారు.

**ప్రత్యామ్నాయ స్థలాల గుర్తింపుపై దృష్టి**

ప్రస్తుత డంపింగ్ యార్డ్‌కు బదులుగా మరోచోట ఏర్పాటు చేసేందుకు అనువైన ప్రభుత్వ స్థలాలను పలు ప్రాంతాల్లో పరిశీలించారు. ప్రత్యామ్నాయ స్థలాల లభ్యత, అక్కడ డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు ఉన్న సాధ్యాసాధ్యాలు, ఇతర అవసరమైన అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్థలాల వివరాలను సమగ్రంగా పరిశీలించి, తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.

**పొగ, కాలుష్య నివారణకు చర్యలు**

ప్రస్తుత డంపింగ్ యార్డ్ నుంచి వెలువడుతున్న పొగ, కాలుష్యంతో పరిసర ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై కలెక్టర్ ఆరా తీశారు. పొగ వ్యాప్తిని నియంత్రించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ అధికారులకు సూచించారు. డంపింగ్ యార్డ్ నిర్వహణలో తలెత్తుతున్న సమస్యలను తగ్గిస్తూ ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. డంపింగ్ యార్డ్ సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారం చూపే చర్యల్లో భాగంగా సీడీఎంఏ ఆధ్వర్యంలో స్వచ్ఛ మైనింగ్ ప్రక్రియతో పాటు ఇతర పనులపై చర్చించారు. చేపట్టనున్న పనులకు సంబంధించిన అంశాలను అధికారులతో సమీక్షించారు. ఈ పనుల ద్వారా ప్రస్తుత సమస్యలను తగ్గించడం, వ్యర్థాల నిర్వహణను మెరుగుపరచడం వంటి అంశాలపై చర్చించారు.

**శాశ్వత పరిష్కారమే లక్ష్యం**

డంపింగ్ యార్డ్ సమస్యకు తాత్కాలిక చర్యలతో పాటు దీర్ఘకాలిక పరిష్కారం చూపడంపై అధికారులు దృష్టి సారించారు. ప్రత్యామ్నాయ స్థలం ఎంపిక, కాలుష్య నియంత్రణ, ప్రతిపాదిత పనుల అమలుకు సంబంధించి అవసరమైన వివరాలను పరిశీలించి ముందుకు వెళ్లాలని కలెక్టర్ సూచించారు. ప్రజలకు ఇబ్బందులు తగ్గించేలా సమన్వయంతో చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# కాయకల్ప అవార్డులో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి ప్రథమ బహుమతి

**పెద్దపల్లి: అక్టోబర్ 15 మనం న్యూస్ : ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యం, రోగుల భద్రత, ఆసుపత్రి నిర్వహణ ప్రమాణాలను మెరుగుపరిచే లక్ష్యంతో నిర్వహిస్తున్న కాయకల్ప కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి మొదటి బహుమతి లభించింది.2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రకటించిన కాయకల్ప అవార్డుల జాబితాలో పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి 90 స్కోరు సాధించి, “బెస్ట్ షేరింగ్” విభాగంలో మరియు 91 స్కోర్ సాధించి, “ఎకో ఫ్రెండ్లీ” విభాగాలలో ఈ అవార్డుకు ఎంపికైంది.ఆసుపత్రిలో పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణ, ఇన్‌ఫెక్షన్ నియంత్రణ, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా చేపడుతున్న చర్యలకు ఈ గుర్తింపు లభించింది.ఈ అవార్డు ఆసుపత్రి వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బంది మరియు ఇతర ఉద్యోగుల సమిష్టి కృషికి గుర్తింపుగా నిలుస్తుంది. ఈ పురస్కారం ఆసుపత్రిలో సేవల నాణ్యతను మరింత మెరుగుపరిచేందుకు ప్రోత్సాహాన్ని అందించనుంది.ఈ సందర్భంగా గౌరవ జిల్లా కలెక్టర్ పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ గారిని, ఆసుపత్రి వైద్యులు మరియు ఇతర సిబ్బందిని అభినందించడం జరిగింది.**